RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త


తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 250 మేడ్చల్ మల్కాజ్‌గిరి 1 అక్టోబర్ 2024 మంగళవారం పేజీలు : 4

## మోదీని దించేదాకా బతికే ఉంటా!

జమ్ము : జమ్మూకశ్మీరులోని కథువా జిల్లాలో ఎన్నికల ప్రచారంలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తుండగా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అస్వస్థతకు గురయ్యారు. ఇటీవల ఉగ్రవాదులతో జరిగిన ఎదురుకాల్పుల్లో మరణించిన హెడ్‌కానిస్టేబుల్‌కు వేదికపై నివాళులర్పిస్తుండగా.. ఖర్గే కింద పడబోయారు. వెంటనే పార్టీ నేతలు ఆయన్ను పట్టుకున్నారు. వైద్యులు ప్రథమ చికిత్స అందిం చిన వెంటనే తేరుకున్న ఖర్గే ప్రసంగాన్ని కొనసాగించారు. "నాకు 83ఏళ్లు. నేనంత తొందరగా ఏమీ చనిపోను. ప్రధాని మోదీని గద్దె దించే వరకు నేను బతికే ఉంటా"అని స్పష్టంచేశారు. తనకు ఇంకా మాట్లాడాలని ఉన్నప్పటికీ నీరసం వల్ల కూర్చుండిపోవాల్సి వస్తోందని, క్షమించాలని ప్రజలను కోరారు. అంతకుముందు ఆయన కాంగ్రెస్.. దేశం కోసం చేసిన పనులను ఏకరువు పెట్టారు.




# 'హైడ్రా'పై ప్రశ్నల వర్షం

## చార్మినార్‌ను కూల్చాలని ఎమ్మార్వో చెబితే కూల్చేస్తారా..

## హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం!

హైదరాబాద్ : నగరంలో హైడ్రా విభాగం జరుపుతున్న కూల్చివేతలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ దాఖలైన పిటిషన్లను హైకోర్టు ఇవాళ విచారించింది. ఈ విచారణకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ వర్చువల్‌గా హాజరవగా, అమీన్‌పూర్ తహసీల్దార్ నేరుగా హాజరయ్యారు. ఈసందర్భంగా అమీన్‌పూర్ తహసీల్దార్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. భవనాన్ని 48 గంటల్లోగా ఖాళీ చేయాలని నోటీసులిచ్చి.. 40 గంటల్లోపే ఎలా కూల్చేస్తారని న్యాయస్థానం సీరియస్ అయింది. తాము అడిగే ప్రశ్నలకు మాత్రమే సమాధానాలు చెప్పాలంటూ హైడ్రా కమిషనర్‌కు హైకోర్టు బెంచ్ స్పష్టం చేసింది. చార్మినార్‌ను కూల్చాలని అక్కడి ఎమ్మార్వో చెబితే కూల్చేస్తారా అని హైడ్రా కమిషనర్‌ను తెలంగాణ హైకోర్టు ప్రశ్నించింది. 'కేవలం శని, ఆదివారాలు, సూర్యాస్తమయం తర్వాతే కూల్చివేతలు ఎందుకు చేపడుతున్నారు ? సెలవు రోజుల్లోనే అందరికీ నోటీసులు ఇచ్చి అత్యవసరంగా కూల్చివేయడానికి కారణం ఏమిటి ? శని, ఆదివారాల్లో నిర్మాణాలను కూల్చివేయొద్దని గతంలో కోర్టు తీర్పులు ఉన్నాయి కదా ?" అని హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది.

"ప్రభుత్వ ఉద్యోగులు ఆదివారం ఎందుకు పని చేయాలి ? ఉన్నతాధికారులను మెప్పించేందుకు ఎవరూ చట్ట విరుద్ధంగా పని చేయొద్దు" అని న్యాయస్థానం సూచించింది. "ఇళ్లను కూల్చే ముందు దాని యజమానికి కనీసం లాస్ట్ ఛాన్స్ ఇచ్చారా ? చనిపోయే వ్యక్తిని కూడా చివరి కోరిక అడుగుతారు కదా" అని హైకోర్టు బెంచ్ హైడ్రా కమిషనర్‌ను నిలదీసింది.

''పొలిటికల్ బాస్‌లను సంతృప్తి పరిచేందుకు అత్యుత్సాహంతో పని చేయకూడదు. ఇక నుంచి అధికారులు చట్ట వ్యతిరేకంగా పని చేస్తే నేరుగా ఇంటికి వెళ్లాల్సి వస్తుంది" అని న్యాయస్థానం హెచ్చరిక చేసింది. జనం ఇళ్లు ఖాళీ చేయనంత మాత్రాన అత్యవసరంగా కూల్చాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించింది. కోర్టు ఆర్డర్లను కూడా పట్టించుకోలేదంటూ అమీన్‌పూర్ తహసీల్దార్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈక్రమంలో అమీన్‌పూర్ కూల్చివేతలపై హైకోర్టు బెంచ్‌కు హైడ్రా కమిషనర్ బదులిస్తూ.. "ఎమ్మార్వో విజ్ఞప్తి మేరకే మేం చర్యలు తీసుకున్నాం" అని చెప్పారు. ఈ సమాధానాన్ని తప్పుపట్టిన హైకోర్టు బెంచ్.. "ఎమ్మార్వో అడిగితే గుడ్డిగా చర్యలు తీసుకుంటారా ? ఎమ్మార్వో చెప్పాడని చార్మినార్, హైకోర్టు కూడా కూల్చేస్తారా" అని ప్రశ్నించింది.

## ఆ ఎమ్మెల్యేల చేరికలు కాస్త లేట్ కావొచ్చు.. కానీ పక్కా, దానం సంచలన వ్యాఖ్యలు




హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ దాదాపుగా అన్ని స్థానాల్లోనూ పాగా వేసింది. మరోవైపు ప్రతిపక్ష పార్టీగా ఎన్నికల బరిలోకి దిగిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా 64 స్థానాల్లో జెండా ఎగరేసింది. కానీ గ్రేటర్ పరిధిలో మాత్రం ఖాతా తెరవలేకపోయింది. అయితే తాజాగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే 10 మంది గులాబీ ఎమ్మెల్యేలు హస్తం గూటికి చేరనున్నట్లు చెప్పారు. కాంగ్రెస్‌లోకి రావాలనుకుంటున్న పింక్ ఎమ్మెల్యేలను తమపై హైకోర్టులో ఉన్న కేసును బూచిగా చూపించి బీఆర్ఎస్ పెద్దలు బెదిరిస్తున్నారని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో చిట్ చాట్‌గా మాట్లాడిన దానం, కొంచెం ఆలస్యం అవుతుందేమో కానీ మిగతా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరిక మాత్రం తప్పకుండా ఉ ంటుందన్నారు. మరోవైపు ప్రతిపక్ష పార్టీలోని అగ్రనేతలు, బీజేపీతో కలిసి సీఎం రేవంత్ రెడ్డిని అసభ్య పదజాలంతో తిట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. రాజకీయాల్లో హరీష్ రావు గౌరవప్రదంగా ఉండేవారని, ఇప్పుడు ఆయన కూడా గాడి తప్పారని దానం అంటున్నారు. తమను బీఆర్ఎస్ నేతలు రెచ్చగొడుతున్న అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానని అన్నారు.

**జనాలకు ముందే చెప్పాల్సింది...** ఏదైనా భవనం కూలగొట్టే ముందు అక్కడి వాస్తవ పరిస్థితులను ప్రజలకు అర్థమయ్యేలా హైడ్రా వివరిస్తే బాగుండన్నారు. అలా చేస్తే ఇప్పుడు ఇంతలా ఇబ్బందులు ఎదురయ్యేవి కావని ఆయన అన్నారు. ఇక చిన్న చిన్న ఘటనలు ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నాయని, ఓ చిన్నారి తన పుస్తకాలు ఇంట్లో ఉన్నాయని ఏడ్చిన ఘటన తనకు బాధ కలిగించిదన్నారు.

అప్పట్లో గులాబీ సర్కార్ ఇలాంటి పనులు చేసినప్పుడు ఎవరు కూడా మాట్లాడలేదని చెప్పుకొచ్చారు.

**నిజనిర్ధారణకు కమిటీ కావాలి...** హైడ్రా కూల్చివేతలపై నిజ నిర్ధారణ కమిటీ వేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తానన్నారు. ఇంకాస్త ముందే హైడ్రా స్పందించి ఉంటే, ప్రజల్లో ఇంతలా అభద్రతా భావం మొదలయ్యేదే కాదన్నారు.

**హైడ్రాపై బీఆర్ఎస్ హైడ్రామా చేస్తుందా? అప్పట్లోనే విచ్చలవిడిగా పర్మిషన్లు...** అక్రమ కట్టడాలకు గత ప్రభుత్వమే విచ్చలవిడిగా అనుమతులు ఇచ్చిందని దానం వెల్లడించారు. మూసీలో ఆక్రమణలు ఉన్నాయని మంత్రిగా కేటీఆర్ ఎందుకు చెప్పలేదని నిలదీశారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు మూసీలోని అక్రమకట్టడాలను కూల్చేస్తామని ప్రకటించారని, ఇప్పుడు ఆ విషయాన్ని మర్చిపోయారా అని బీఆర్ఎస్ పార్టీని కడిగిపారేశారు. భవనాల కూల్చివేతలపై కాంగ్రెస్ పక్షాన ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు.

**గరీబోళ్ల ఇళ్లను కూల్చితే కష్టం..** తన నియోజకవర్గంలో జలవిహార్, ఐమాక్స్ లాంటి ప్రదేశాల్లో పేదవాళ్ల ఇళ్లను మూసీ సుందరీకరణ పేరుతో కూల్చడం సరికాదన్నారు. మూసీ నిర్వాసితులకు మొదట కౌన్సిలింగ్ ఇవ్వాలని, ఆ తర్వాతే ఇతర ప్రాంతాల్లో ఏర్పాట్లు చేసి ఖాళీ చేయించాలన్నారు. ఇళ్లకు రెడ్‌మార్క్ చేయడం కచ్చితంగా తొందరపాటేనన్నారు. కూల్చిన ఇళ్లకు స్థానికంగానే నివాసాలు కల్పించేలా సీఎం దృష్టికి తీసుకెళతానని స్పష్టం చేశారు.

## కుటుంబ సభ్యులు అంగీకరిస్తేనే ఫొటో తీయండి: సీఎం రేవంత్



హైదరాబాద్: కుటుంబ డిజిటల్ కార్డుల పంపిణీ సమయంలో కుటుంబ సభ్యులు అంగీకరిస్తేనే కుటుంబం ఫొటో తీయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం గుర్తించిన కుటుంబాన్ని నిర్ధరించాలన్నారు. కుటుంబ డిజిటల్ కార్డులపై సోమవారం సీఎం సమీక్ష నిర్వహించారు. డిజిటల్ కార్డుల కోసం సేకరించే వివరాలను అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అక్టోబరు 3 నుంచి 7 వరకు పైలట్ ప్రాజెక్టులో భాగంగా క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని సీఎం ఆదేశించారు. " రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాలు, 238 ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలి. కొత్త సభ్యులకు జత చేసి, చనిపోయిన వారిని తొలగించాలి. పైలెట్ ప్రాజెక్టులో ఎదురైన వివరాలతో నివేదిక తయారు చేయాలి. కుటుంబ సభ్యుల వివరాల మార్పులు చేర్పుల్లో జాగ్రత్తలు తీసుకోవాలి" అని సీఎం సూచించారు.

## మూసీ సుందరీకరణ... హైడ్రా కమిషనర్ కీలక ప్రకటన



హైదరాబాద్: మూసీ సుందరీకరణపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక ప్రకటన చేశారు. నదికి ఇరువైపులా సర్వేలతో హైడ్రాకు సంబంధం లేదన్నారు. మూసీ నది పరిధిలో నివసిస్తున్నవారిని హైడ్రా తరలించడం లేదని, నదిలో ఎలాంటి కూల్చివేతలు చేపట్టడం లేదన్నారు. నదీ పరివాహక ప్రాంతంలోని ఇళ్లపై హైడ్రా మార్కింగ్ చేయడం లేదని, మూసీ సుందరీకరణ అనేది ప్రత్యేక ప్రాజెక్టని చెప్పారు. దానిని మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చేపడుతోందని వెల్లడించారు.



# జమిలివైపు... వడివడిగా అడుగులు!

## సాధ్యాసాధ్యాలపై మోడీ టీం కసరత్తు!

## పార్లమెంటులో 3 బిల్లులు పెట్టనున్న కేంద్రం వీటిలో రెండు రాజ్యాంగ సవరణ బిల్లులు

న్యూఢిల్లీ : లోక్‌సభలో బీజేపీకి సొంతంగా మెజారిటీ లేకపోయినా.. 'ఒకే దేశం–ఒకే ఎన్నిక'పై మోదీ ప్రభుత్వం ఏ మాత్రం వెనక్కి తగ్గడంలేదు. జమిలి ఎన్నికలను సాకారం చేసేందుకు పార్లమెంటులో మూడు బిల్లులను ప్రవేశపెట్టాలని సంకల్పించింది. వీటిలో రెండు రాజ్యాంగ సవరణ బిల్లులు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలోని అత్యున్నత స్థాయి కమిటీ చేసిన సిఫారసులను కేంద్ర మంత్రివర్గం ఇటీవల ఆమోదించిన సంగ తి తెలిసిందే. ప్రతిపాదిత మొదటి రాజ్యాంగ సవరణ బిల్లు ప్రకారం.. 'అపాయింటెండ్ డే (ప్రభుత్వం ప్రా రంభమయ్యే రోజు)'కు సంబంధించి 82ఏ అధికరణలో కొత్తగా సబ్‌క్లాజ్ (1) చేరుస్తారు. లోక్‌సభ, అన్ని రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల అసెంబ్లీల పదవీకాలాన్ని ఒకేసారి ముగించేందుకు 82ఏలోనే సబ్‌క్లాజు (2) జోడిస్తారు. ఇక లోక్‌సభ పదవీకాలం, రద్దుకు సంబంధించి 83(2) అధికరణను సవరించి కొత్తగా సబ్‌క్లాజ్ (3), (4)లను చేరుస్తారు. రాష్ట్రాల అసెంబ్లీల రద్దు నిబంధనలూ ఇందులో ఉంటాయి. 327అధికరణను సవరించి 'సమాంతర ఎన్నికలు' అనే పదబం?ధాన్ని జోడిస్తారు. ఈ బిల్లుకు కనీసం సగం రాష్ట్రాలు ఆమోదించాల్సిన అవసరం లేదని కోవింద్ కమిటీ సిఫారసు చేసింది. దీనిని క్యాబినెట్ ఆమోదించింది. ఇక రెండో రాజ్యాంగ సవరణకు మా త్రం కనీసం సగం రాష్ట్రాల అంగీకారం తప్పనిసరి. ఎందుకంటే ఇది స్థానిక ఎన్నికలకు సంబంధించింది. పూర్తిగా రాష్ట్ర జాబితాలోని అంశం. లోక్‌సభ/అసెంబ్లీ ఎన్నికలతో పాటు సమాంతరంగా పంచాయతీరాజ్/పురపాలక, నగరపాలక సంస్థలకూ ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ల(ఎసఈసీ)తో కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) సంప్రదింపులు జరి పి అన్ని ఎన్నికలకూ ఒకే ఓటర్ల జాబితా రూపొందించడానికి ఉద్దేశించిన బిల్లు ఇది. దీనిప్రకారం 324ఏ అధికరణను కొత్తగా చేరుస్తారు. రాజ్యాంగం ప్రకారం ఈసీ, ఎస్ఈసీ వేర్వేరు వ్యవస్థలు. ఈసీ రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, లోక్‌సభ, రాజ్యసభ, అసెంబ్లీ, శాసనమండలి ఎన్నికలు నిర్వహిస్తుంది. ఎస్ఈసీ పంచాయతీలు, మునిసిపాలిటీల ఎన్నికల నిర్వహణ బాధ్య త చూస్తున్న సంగతి తెలిసిందే. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల నియమ నిబంధనలు కేంద్ర పాలిత ప్రాం తాలైన పుదుచ్చేరి, ఢిల్లీ, జమ్మూకశ్మీరు అసెంబ్లీలకు కూడా వర్తించేలా మూడు చట్టాలు.. ఢిల్లీ దేశరాజధాని ప్రాంత ప్రభుత్వ చట్టం (1991), కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వ చట్టం (1963), జమ్మూకశ్మీరు పునర్వ్యవస్థీకరణ (2019) చట్టాలను సవరించాలని మూడో బిల్లులో ప్రతిపాదించనున్నారు. వీటికి సంబంధించిన అధికరణల్లో 12 కొత్త సబ్‌క్లాజులను చేరుస్తారు. రెండు దశల్లో జమిలి ఎన్నికలను నిర్వహించాలని కోవింద్ కమిటీ సూచించింది. మొదటి దశలో లోక్‌సభ, అన్ని రాష్ట్రాలకు ఒకేసారి ఎన్నికలు జరపాలని పేర్కొంది. ఇవి జరిగిన వంద రోజుల్లోపు రెండో దశలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపాలని సిఫారసు చేసింది.

# సంపాదకీయం

## కశ్మీర్ లో అధికారం కోసం ఈ మాటలు అవసరమా?

రాజకీయం చేయాల్సిందే. అందునా పవర్ కోసం కొన్నితిప్పలు తప్పవు. అన్ని సందర్భాల్లో కాకున్నా కొన్ని సందర్భాల్లో కచ్చితంగా జాతీయ ప్రయోజనాలు .. దేశ సంరక్షణ లాంటి అంశాల్ని పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న విధానాల్ని చూస్తే.. ఆ పార్టీ ఎప్పటికి మారుతుందన్న సందేహం కలుగక మానదు. దేశంలోని మిగిలిన అంశాలు వేరు. జమ్ముకశ్మీర్ అంశాన్ని వేరుగా చూడాల్సిన అవసరం ఉంది. తాజాగా జరుగుతున్న రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల వేళ.. జమ్ముకశ్మీర్ లో గెలుపు కోసం తీవ్రంగా శ్రమిస్తున్న ఆ పార్టీ.. కశ్మీర్ విషయంలో బాధ్యత లేకుండా ప్రవర్తిస్తుందన్న వాదనకు బలం చేకూరేలా ఆ పార్టీ ముఖ్యనేతల్లో ఒకరైన ప్రియాంక వాద్రా సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము అధికారంలోకి వస్తే జమ్ముకశ్మీర్ కు తిరిగి రాష్ట్ర హోదాను ఇస్తామని పేర్కొన్నారు. ఆరని రావణకాష్ఠంలా మారిన కశ్మీర్ విషయంలోనూ.. ఆ రాష్ట్రానికి ఉన్న ప్రత్యేక హోదాను ఇచ్చే ఆర్టికల్ 370 విషయంలో మరే ప్రభుత్వం చేయని రీతిలో మోడీ సర్కారు సంచలన నిర్ణయాన్ని తీసుకోవటం.. దేశంలోని మిగిలిన ప్రాంతాల మాదిరి కశ్మీర్ ను చేయటం తెలిసిందే. అదే సమయంలో కేంద్రపాలిత ప్రాంతంగా మార్చి.. కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ తీరుపై జమ్ముకశ్మీర్ లోని రాజకీయ పార్టీలు గుర్రుగా ఉన్నాయి. కొన్ని పార్టీలు అయితే.. రద్దు చేసిన ఆర్టికల్ 370 హోదాను పునరుద్ధరిస్తామంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఇలాంటివేళ..కాంగ్రెస్ ముఖ్యనేత ప్రియాంక సైతం జమ్ముకశ్మీర్ మీద అవగాహనలేమితో వ్యాఖ్యలు చేశారన్న వాదన వినిపిస్తోంది. జమ్ముకశ్మీర్ విషయంలో కాంగ్రెస్ కు స్పష్టమైన విధానం ఉందన్న ప్రియాంక చేసిన వ్యాఖ్యల్లో కీలక అంశాల్ని చూస్తే..

– మా పార్టీ అధికారంలోకి రాగానే జమ్ముకశ్మీర్ కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తాం. – సీజన్ వారీగా జమ్ము.. శ్రీనగర్ మధ్య ప్రభుత్వ కార్యాలయాల మార్పిడిని పునరుద్ధరిస్తాం. – జమ్ముకశ్మీర్ పౌరుల హక్కులను కాపాడుతాం. – మా నాన్నమ్మ ఇందిరకు జమ్ముకశ్మీర్ తో ఉన్న అనుబంధం వేరు. – ఆమె హత్యకు నాలుగైదు రోజుల ముందు కశ్మీర్ అందాల్ని చూడాలని మాతో చెప్పారు.

– రాష్ట్ర హోదా కావాలంటే బీజేపీకి ఓటు వేయాలని అమిత్ షా అడుతున్నారు. రాష్ట్ర హోదా తీసుకున్నదే వారు. తీసుకెళ్లినోళ్లే ఎలా ఇస్తారు? – టీవీ ఎత్తికెళ్లినోళ్లే టీవీ కావాలంటే తమను అడగాలని చెప్పినట్లు వారి మాటలు ఉన్నాయి. జమ్ముకశ్మీర్ పై ప్రధాని మోడీకి ఎలాంటి ప్రేమా లేదు. – వారి రాజకీయ చదరంగంలో జమ్ముకశ్మీర్ అన్నది ఒక పావు మాత్రమే. దేశవ్యాప్తంగా భావోద్వేగాలను రెచ్చగొట్టేందుకు జమ్ముకశ్మీర్ అంశానని వాడుకుంటున్నారు.

## రైతులకు మరిన్ని విస్తృత సేవలు

### శామీర్ పేట సహకార సంఘ చైర్మెన్ మధుకర్ రెడ్డి





శామీర్ పేట, (గరుడ వార్త): రైతుల సంక్షేమం కోసం పనిచేస్తూ వారికి మరిన్ని విస్తృత సేవలను అందిస్తామని డిసీఎంఎస్ వైస్ చైర్మన్, శామీర్ పేట రైతు సేవా సహకార సంఘం చైర్మెన్ మధుకర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రం శామీర్ పేట రైతు సేవ సహకార సంఘంలో చైర్మెన్ మధుకర్ రెడ్డి అధ్యక్షతన 43వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మధుకర్ రెడ్డి మాట్లాడుతూ సంఘ సభ్యుల నుంచి సలహాలు, సూచనలు తీసుకొని రైతులకు మరిన్ని నాణ్యమైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. శామీర్ పేట సహకార సంఘం పరిధిలోని గ్రామాల రైతులకు సేవలు అందిస్తున్నామని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం సహకార సంఘంలో కూరగాయలు, పండ్లు కొనుగోలు చేసే కేంద్రం ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే మూడు చింతల పల్లిలో సైతం సొసైటి భవనాన్ని త్వరలో ప్రారంభించడం జరుగుతుందని, అక్కడ రైతులకు సేవలను అందిస్తామని చైర్మెన్ మధుకర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కోపరేటివ్ యునియన్ జాయింట్ రిజిస్ట్రార్ సురేఖ, ఇక్రిశాట్ శాస్త్రవేత్త, సహకార సంఘం వైస్ చైర్మెన్ ఐలయ్య యాదవ్, సంఘ డైరెక్టర్లు, సంఘ సీఈఓ నర్సింహులు, నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ పౌరహక్కులపై అవగాహనకలిగి ఉండాలి




శామీర్ పేట, (గరుడ వార్త): పౌర హక్కుల పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ తాహసిల్దార్ నాగజ్యోతి కోరారు. మూడుచిం తలపల్లి మండలం ఉద్దమర్రి గ్రామంలో సోమవారం తహసీల్దార్ వెంకట నరసింహారెడ్డి ఆదేశాల మేరకు పౌర హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ నాగజ్యోతి మాట్లాడుతూ రాజ్యాంగ ద్వారా కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ హక్కుల సాధనకు కృషి చేయాలని, ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాలు నేతలు ప్రజలను ఎల్లప్పుడూ చైతన్యవంతులను చేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆర్ ఐ సరస్వతి, పంచాయతీ కార్యదర్శి మోహన్ సింగ్, గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తెల్లకార్డు లేక.. పథకాలు అందక



పరిగి : రేషన్ కార్డులు జారీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ప్రకటించడంతో పేదలు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. సంక్షేమ పథకాలకు తెల్లకార్డులే ప్రామాణికంగా తీసుకోవడంతో నిరుపేదలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. గత కొన్నేళ్లుగా కార్డుల జారీ నిలిపివేయడంతో పాటు ఉన్న వాటిని సైతం వివిధ కారణాలతో రద్దు చేశారు. తొలగించిన కార్డుల్లో ఎవరైనా అర్హులు ఉంటే పునరుద్ధరించనున్నట్లు అధికారులు మూడేళ్ల క్రితం పేర్కొన్నారు. దీంతో కార్డులు కోల్పోయిన నిరుపేదలకు ఊరట కలిగింది. జిల్లా ఎక్కువగా గ్రామీణ ప్రాంతం కావడం, వ్యవసాయాధారితం కావడంతో ప్రభుత్వం అందించే రేషన్‌పైనే చాలా మంది ఆధారపడ్డారు. కార్డులు కోల్పోయిన కారణంగా నిరుపేదలు సరుకులు విపణిలో కొనుగోలు చేయడం తలకుమించిన భారంగా మారింది.

**రద్దయిన కార్డులు** జిల్లాలోని తాండూరు, పరిగి, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలో పలు కారణాలు చూపుతూ 24వేల కార్డులను తొలగించారు. వీరందరికీ నోటీసులు అందజేశారు. లబ్ధిదారులు ఇచ్చే సమాధానంతో క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించారు. కొందరు ప్రభుత్వ ఉద్యోగాలు పొంది, మరికొందరు చనిపోవడం, గ్రామంలో లేకుండా పోవడం వంటి వాటిని పరిగణనలోకి తీసుకుని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాల శాఖ అధికారులు పేర్కొన్నా అడుగు ముందుకు పడలేదు. కనీసం మార్పులు, చేర్పులకు కూడా అవకాశం లేకపోయింది. దీంతో కొందరు అర్హులు కూడా కార్డులను కోల్పోవాల్సి రావడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగి వేసారిపోతున్నారు. గత అర్జీలను పక్కనపెట్టిన సర్కారు తాజాగా ప్రజాపాలనలో వచ్చిన వాటికే ప్రాధాన్యత ఇవ్వనుంది.

**కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు** కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలనలోనూ రేషన్ కార్డులకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. దాదాపు పదివేలకు పైగానే అర్జీలు వచ్చినట్లు సమాచారం. కార్డులు లేని కారణంగా గృహజ్యోతి, రుణమాఫీ, గ్యాస్ పథకాలకు దూరంగా ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా త్వరగా అందించి ఫలాలు అందే విధంగా చూడాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ – రాజేశ్వర్, జిల్లా పౌరసరఫరాల అధికారి ఖాళీగా ఉన్న డీలరు పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోంది. వివిధ మండలాల్లో ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశాం. కొత్త కార్డులకు సంబంధించిన సమాచారం అధికారికంగా రాలేదు.

## సేకరణలో నిర్లక్ష్యం.. కుప్పలుగాచెత్త

జగిత్యాల : జిల్లాకేంద్రంలో పారిశుద్ధ్య నిర్వహణ గాడితప్పింది. స్థానిక 33, 16, 32వ వార్డులకు చెందిన చెత్త సేకరణ ఆటోలు 2 నెలలుగా రావడంలేదు. పట్టణంలో కాలానుగుణ వ్యాధులు పెరుగుతున్నాయి. మరోవైపు డెంగీ విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో చెత్త సేకరణ చేపట్టకపోవడంపై పలు కాలనీలవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో ప్రతిరోజు 70 మెట్రిక్‌టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. 46 ఆటోలు, 13 ట్రాక్టర్లు, డంపర్ పేసర్, టిప్పర్‌తోపాటు స్వీపింగ్ యంత్రం ఉన్నాయి. పారిశుద్ధ్య నిర్వహణకు 38 శాశ్వత, 262 ఒప్పంద కార్మికులు పనిచేస్తున్నారు. క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన కొరవడి కార్మికుల హాజరు, ఇంధన వినియోగంలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి.

మరమ్మతులో 14 ఆటోలు..

ఏడాది కాలంగా బల్దియాలో 14 ఆటోలు పనిచేయడంలేదు. మొత్తం 46 ఆటోల్లో 14 ఆటోలు మరమ్మతులో ఉండటంతో పలు వార్డుల్లో చెత్త సేకరణ సజావుగా చేపట్టడంలేదు. ఉన్న కొన్ని ఆటోలు, సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతోంది. ఈ క్రమంలో తరచూ వాహనాలు మొరాయిస్తున్నాయి. మరమ్మతు చేపట్టాల్సిన ఇంజినీరింగ్ విభాగం అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. 13 ట్రాక్టర్లలో ఒక ట్రాక్టరు మూలన పడేశారు. రూ.40 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన స్వీపింగ్ యంత్రం ఏడాది కాలంగా మెకానిక్ షెడ్డుకే పరిమితమైంది. ప్రధాన రహదారుల్లోనూ శుభ్రత అంతంతమాత్రంగానే ఉంది.

ఒకే ఏడాదిలో రూ.35 లక్షలు..2023 సంవత్సరంలో ఒకే ఏడాదిలో వాహనాల మరమ్మతు పేరిట రూ.35 లక్షలు ఖర్చు చేశారు. బల్దియాలో తొలుత రూ.10 లక్షలకు అనుమతి తీసుకొని వరుసగా మరమ్మతు బిల్లులు రూ.35 లక్షలు వ్యయం చేశారు. ఇందుకు సంబంధించిన బిల్లులు ఎజెండాకు రావడంతో మెజార్టీ సభ్యులు అభ్యంతర వ్యక్తం చేయడంతోపాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే అప్పటి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బిల్లుల మంజూరు నిలిపివేసి మరమ్మతు కోసం టెక్నికల్ అధికారిని నియమించారు. గత 4 నెలల నుంచి ఇంజినీరింగ్ విభాగం వారే మరమ్మతు చేపడుతున్నారు.

'వీరంతా స్థానిక 33వ వార్డు కాలనీవాసులు. రెండు నెలలుగా తమ వార్డుకు కేటాయించిన ఆటో చెత్తసేకరణకు రాకపోవడంతో చెత్తను వీధుల్లో వేయాల్సి వస్తోందని చెబుతున్నారు. ఫిర్యాదు చేస్తే వాహనం మరమ్మతుకు గురైందని ప్రత్యామ్నాయంగా వారానికోసారి పక్క వార్డు వాహనాన్ని పంపిస్తున్నారని వాపోయారు. చెత్త సేకరణ లేకపోవడంతో తాము రోగాల బారిన పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.'

## ఓ ఆర్ ఆర్ పై రోడ్డు ప్రమాదం.. ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలు...

శామీర్ పేట, (గరుడ వార్త) : ఓ ఆర్ ఆర్ రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలైన సంఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డుపై సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భూపాలం పల్లి జిల్లా, బొమ్మపూర్ గ్రామం నుంచి మనోహర్ రెడ్డి తన తల్లి పుష్పలత (48), అక్క రస్మిత, ఆమె కూతురు రియాన్షి లతో కలిసి నిజాంపేట్ కు వస్తున్నారు. మార్గమధ్యంలోని శామీర్ పేట ఔటర్ రింగ్ రోడ్డుపై వర్షం కారణంగా ఎగ్జిట్ 7 వద్ద కారు అదుపుతప్పి డివైడర్ను ఢీ కొట్టి



బోల్తా పడింది. దీంతో కారులో ఉన్న పుష్పలత అక్కడికక్కడే మృతి చెందగా రస్మిత, రియాన్షి లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాద ఘటనను పరిశీలించారు. ఈ మేరకు శామీర్ పేట పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు

## గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలు

శామీర్ పేట, (గరుడ వార్త) : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల శామీర్ పేట (జగద్గిరిగుట్ట) లో బతుకమ్మ సంబురాలను ఘనంగా సోమవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్ మాట్లాడుతూ బతుకమ్మ పాటలు పాడుతూ లయబద్ధంగా చప్పట్లు కొడుతూ విద్యార్థులు, కళాశాల అధ్యాపక బృందం కళాశాలలో బతుకమ్మ సంబరాలను జరుపుకున్నా





రని తెలిపారు. తెలంగాణ సంస్కృతికి, సాంప్రదాయాలకు అద్దం పట్టే ఈ బతుకమ్మ వేడుకలను కళాశాలలో జరుపు కోవడం ఆనందంగా ఉందన్నారు. బతుకమ్మ ఆటలో ఉన్న లయను, బతుకమ్మ పాటలో ఉన్న గొప్పతనాన్ని కళాశాల కల్చరల్ కోఆర్డినేటర్ జి ధనవేణి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చేతన, ఏవిపి డాక్టర్ వి.స్రవంతి, శిల్ప, రాథోడ్ అధ్యాపకులు పాల్గొన్నారు.

## ధ్వంసమైన తాటి చెట్లను పరిశీలించిన అధికారులు...

శామీర్ పేట, (గరుడ వార్త): గీత పనివారలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని గీతా పనివారాల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీ జీ.సాయిలుగౌడ్ ధీమా వ్యక్తం చేశారు అన్నారు. మూడుచింతలపల్లి మండలం ఆద్రాస్ పల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 33, 173–1, 174 ప్రభుత్వ భూమిలో గీత కార్మికులకు కేటాయించిన భూమిలో తాటి–ఈత వనం 2015లో హరితహారం క్రింద సుమారు 3800 మొక్కలు నాటడం జరిగిందన్నారు. కొందరు అక్రమార్కులు



ఆ భూమిని ఆక్రమించేందుకు తాటి చెట్లను ధ్వంసం చేయగా మూడుచింతలపల్లి మండల తహసీల్దార్ కు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. దీంతో స్పందించిన ఎక్సైజ్ ప్రొబిషన్ సూపరింటిండెంట్ ఫయ్యాజుద్దిన్, సీఐ నవనిత తో పాటు అధికారులు సోమవారం గ్రామంలో పర్యటించారు. తాటి చెట్ల ధ్వంసం, గీత కార్మికులకు కేటాయించిన భూమిపై విచారణ జరిపినట్లు డిజె సాయిలు గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గీతా కార్మికులు పాల్గొన్నారు.

# అర్హతకు మించి వైద్యం

కొత్తగూడెం : చుంచుపల్లి మండలంలో ఓ గ్రామీణ వైద్యుడు తనను ఆశ్రయించే రోగులకు రక్త పరీక్షలు సైతం సిఫార్సు చేస్తున్నాడు. క్లినిక్‌లో మూడు పడకలు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నాడు. అర్హతకు మించి వైద్యం అందిస్తున్నాడన్న ఫిర్యాదుతో వైద్యారోగ్య శాఖ అధికారులు తనిఖీలు చేపట్టి క్లినిక్‌ను ఇటీవల సీజ్ చేశారు.

"ఆళ్లపల్లి మండలంలో మరో గ్రామీణ వైద్యుడు ఎంబీబీఎస్ వైద్యుడి స్థాయిలో నాలుగు పడకల క్లినిక్ నిర్వహిస్తున్నాడు. ఏకంగా ఫ్లూయిడ్స్ పెడుతున్నాడు. తెలిసీ తెలియని వైద్యంతో రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాడని ఫిర్యాదులు రావడంతో ఈయన చికిత్స కేంద్రాన్నీ మూసేశారు".

"లక్ష్మీదేవిపల్లి మండలంలో మరో ఆర్ఎంపీ క్లినిక్‌కు తోడు మెడికల్ దుకాణాన్నీ సైతం నిర్వహిస్తున్నాడు. అదీ.. ఏ లైసెన్స్ లేకుండానే! లైసెన్స్‌డ్ దుకాణాల్లో విక్రయించాలని ఔషధాలను రోగులకు ఇస్తూ ఔషధ తనిఖీ అధికారులకు పట్టుబడ్డాడు. అతడిపై కేసు నమోదు చేశారు."

బాధితుల్లో కొందరు ఆరోగ్య పరిస్థితి విషమించాక కార్పొరేట్, ప్రైవేట్ దవాఖానాలకు పరుగెత్తుతున్నారు.

జిల్లాలో కొందరు గ్రామీణ వైద్యులు, ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్లు (పీఎంపీలు) అర్హతకు మించి వైద్యాన్ని అందిస్తున్నారు. తరుణ వ్యాధుల సీజన్ కావడంతో చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే క్రమంలో రోగుల



ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు అని కొందరు వైద్యారోగ్య శాఖకు ఫిర్యాదు చేస్తున్నారు. ఇటీవల తనిఖీలు చేపట్టిన జిల్లా అధికారులు పలు క్లినిక్‌లను మూసేసి నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఎంబీబీఎస్ వైద్యులకు సమాంతరంగా ఏర్పాటు చేసుకుని అర్హతకు మించి వైద్యం చేస్తున్నారని గుర్తించారు.

ఇవీ నిబంధనలు ఆర్ఎంపీ, పీఎంపీలు ప్రథమ చికిత్స కేంద్రం అని మాత్రమే బోర్డు రాసుకోవాలి. రక్త పరీక్షలు చేయొద్దు. సొంతంగా ఇంజెక్షన్లు వేయొద్దు. పడకలు ఏర్పాటు చేయొద్దు. ఫ్లూయిడ్స్ వంటివి ఎక్కించకూడదు. యాంటీబయాటిక్ ఇంజెక్షన్లను ఎక్కించొద్దు. పారాసెటమల్ వంటి మాత్రలు ఇవ్వడం, కట్లు కట్టడం వంటివి మాత్రమే చేయాలి. వైద్య నిపుణులు సిఫార్సు చేసిన ఇంజెక్షన్లే రోగికి ఇవ్వాలి. కేంద్రాల నిర్వహణకు అనుమతి విధిగా పొందాలి. 'క్లినిక్' అనే పదాన్ని బోర్డుపై వినియోగించకూడదు. గర్భిణులు, చిన్న పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లో చికిత్స చేయొద్దు.

రోగుల ప్రాణాలతో చెలగాటం..

జిల్లావ్యాప్తంగా 23 మండలాల పరిధిలో ఆర్ఎంపీ, పీఎంపీలు సేవలందిస్తున్నారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు చేపట్టిన సోదాల్లో దాదాపు 80 శాతం మంది అర్హతకు మించి వైద్యం అందిస్తున్నట్లు తేలింది. కొందరు ఆర్ఎంపీలు సహాయకులను నియమించుకుని, పడకలు ఏర్పాటు చేసుకుని వైద్యం చేయడాన్ని చూసి అధికారులు అవాక్కయ్యారు. మధుమేహం, రక్తపోటు, ఇతర జ్వర నిర్ధారణ పరీక్షలు చేయిస్తున్నారు. చిన్న చిన్న శస్త్రచికిత్సలు వారే చేస్తున్నారు. మరికొందరు అనుమతి లేకుండా మెడికల్ దుకాణాలు నిర్వహిస్తున్నారు. వైద్య నిపుణులు సైతం ఆలోచించే యాంటీ బయాటిక్స్‌ను విచ్చలవిడిగా వాడుతున్నారు. స్టెరాయిడ్స్ కూడా ఇస్తున్నట్లు తనిఖీల్లో తేలింది. దీనివల్ల రోగి సత్వరంగా కోలుకున్నా, ఆ తర్వాత దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతుంటారని వైద్యాధికారులు చెబుతున్నారు. రోగం ఒకటైె.. మందు మరొకటి వినియోగిస్తే రోగ నిరోధక శక్తి తగ్గుతుందని, మూత్రపిండాలు.. కాలేయ వ్యాధులు ప్రబలుతాయని హెచ్చరిస్తున్నారు. ఇటీవల లక్ష్మీదేవిపల్లి మండలం పెనగడపలో ముగ్గురు ఆర్ఎంపీల వద్ద వైద్య పొందిన ఓ వృద్ధుడు శరీరమంతా బొబ్బలు తేలి ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాడు. ఖమ్మం, హైదరాబాద్ ఆసుపత్రుల్లో రూ.6 లక్షలు ఖర్చు చేసి చికిత్సపొందాక కానీ కోలుకోలేదు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు తనిఖీలు విస్తృతంగా చేపట్టాలని, స్థాయికి మించి వైద్యం చేస్తున్నవారిపై కంటితుడుపు చర్యలకు బదులు పటిష్ఠంగా కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

తనిఖీలు ముమ్మరం చేస్తున్నాం

డా.ఎల్.భాస్కర్ నాయక్, ఇన్‌ఛార్జి డీఎంహెచ్ఓ

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై తనిఖీలు ముమ్మరం చేస్తున్నాం. కొందరు సొంతంగా సంఘం ఏర్పాటు చేసుకుని చట్టానికి అతీతంగా వ్యవహరిస్తాం అంటే కుదరదు. సొంత చికిత్సలు, స్థానిక వైద్యం స్థాయులు–పర్యవసానాలపై ప్రజలను కూడా చైతన్యపరుస్తున్నాం. జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలొస్తే నేరుగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులను సంప్రదించాలి. వారి సూచన ప్రకారమే మందులు, ఇంజెక్షన్లు వినియోగించాలి. అర్హతకు మించి వైద్యం చేస్తున్న వారు పద్ధతులు మార్చుకోకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం.

# వైటీపీఎస్‌లో వరుస చోరీలు

దామరచర్ల :యాదాద్రి థర్మల్ విద్యుత్తు ప్లాంటులో వరుస చోరీలు జరుగుతున్నాయి. ప్లాంటు పనులు ప్రారంభమైన ఏడేళ్ల కాలంలో సుమారు రూ.వంద కోట్ల విలువైన ఇనుము చోరీకి గురైనట్లు తెలుస్తోంది. పట్టుబడిన సందర్భాలలో పోలీసులు నామమాత్రపు కేసులు నమోదు చేస్తుండటంతో దొంగతనాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. తాజాగా శనివారం సాయంత్రం ఇనుము సామగ్రితో వాహనం పవర్‌ప్లాంటు నుంచి రాగా.. విశ్వసనీయ సమాచారం మేరకు వాడపల్లి పోలీసులు పట్టుకున్నారు. విచారించగా ఇనుము కొనుగోలుదారు, దందాకు పాల్పడే వారి వివరాలు బహిర్గతమైనట్లు తెలుస్తోంది. సాత్‌తండా, దుబ్బతండాకు చెందిన ముగ్గురు ఈ దందాలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. వీరి ద్వారా ప్లాంటులో పనిచేసే వివిధ సంస్థల ఇంజినీర్లు, ఉద్యోగులు పాత ఇనుమును వాహనాలలో తరలిస్తున్నారు. ఇందుకు భారీగా నగదు చేతులు మారుతున్నట్లు తెలుస్తోంది. రెండు నెలల క్రితం ఇనుము చోరీ చేసే ముఠా పోలీసులకు పట్టుబడింది. వీరి వెనుక మిర్యాలగూడ పట్టణానికి చెందిన కొందరు వ్యాపారులు ఉన్నారని తెలుస్తోంది. కొద్ది రోజుల వ్యవధిలోనే చోరీలు పునరావృతం కావడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

సీపీఎఫ్ ఆధీనంలో ఉన్నా.. వైటీపీఎస్ ప్లాంటు పనులు 2017లో ప్రారంభం కాగా.. 2022 వరకు ప్లాంటు భద్రతను సివిల్ పోలీసులు చూసేవారు. ఏడాదిన్నర క్రితం ప్లాంటు రక్షణను సీపీఎఫ్(ప్రత్యేక రక్షణ బృందం)కు అప్పగించారు. ఒక డీఎస్పీ, సీఐ, ఇద్దరు ఎస్సైలతో పాటు 70 మంది సీపీఎఫ్ సాయుధ బలగాలు నిరంతరం కాపలాగా ఉంటున్నారు. అంతేగాక ప్లాంటు చుట్టూ వాచ్‌టవర్లు, సీసీకెమెరాల పర్యవేక్షణ ఉన్నప్పటికీ చోరీలు ఆగకపోవడం గమనార్హం.

ఎక్కడ చూసినా సామగ్రి.. నిర్మాణానికి అవసరమయ్యే ఇనుము, అల్యూమినియం, కాపర్ సామగ్రిని ప్లాంటు లోపల, వెలుపల ఇష్టానుసారంగా నిల్వ ఉంచారు. ప్లాంటు నిర్మాణ బాధ్యతను బీహెచ్ఈఎల్‌కు అప్పగించామని, సామగ్రి రక్షణ బాధ్యత తమకు లేదని ప్లాంటు సీఈ సమ్మయ్య ఇటీవల వెల్లడించడం విశేషం. రూ.కోట్ల విలువైన ఇనుము సామగ్రిని ఇష్టానుసారంగా వదిలేయడంతో చోరీలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొంత సామగ్రి తుప్పు పట్టినట్లు తెలుస్తోంది. టీవీగూడెం వైపు నిల్వ ఉన్న సామగ్రి చుట్టూ రక్షణ కంచె లేకపోవడంతో చోరీలు సులువుగా జరుగుతున్నాయి.

# రాజులు ఏలిన ప్రాంతాలు.. ప్రకృతి సోయగాలు

కరీంనగర్ : జలపాతాలు, చారిత్రక కట్టడాలు, పురాతన దేవాలయాలు.. ఉమ్మడి జిలా పర్యాటకుల మనసులను పులకరింపజేస్తాయి. యాత్రికులను ఆకట్టుకునే పుణ్యక్షేత్రాలు.. రాజులు పాలించిన ప్రాంతాలను ఇప్పటికీ వేలమంది సందర్శిస్తున్నారంటే వీటి ప్రాధాన్యత ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఆయా ప్రాంతాల్లో సౌకర్యాలు.. వసతులు కల్పిస్తే మరింత ఆదాయం సమకూరనుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పర్యాటక క్షేత్రాల విశేషాలు, వాటి అభివృద్ధి అనుకూలతలపై 'న్యూస్‌టుడే' కథనం.

కోటలు.. చరిత్రకు ఆనవాళ్లు

ప్రదేశం: ఎలగందుల ఖిల్లా, కరీంనగర్ జిల్లా

నిర్మించినది : శాతవాహనులు. కోటి లింగాలను రాజధానిగా ప్రాంతీయ ఏడు రాజులు గోభద, నారన, కంవయస, సమగోప పాలనలో నిర్మితమైనట్లు లభ్యమైన నాణేలను బట్టి తెలుస్తుంది.

ప్రత్యేకత : ఈ కోట శాతవాహనులతోపాటు బాదామి చాళుక్యుల (550–750) నుంచి ఆసఫ్‌జాహీల(1724–1948) కాలం వరకు పాలన కేంద్రంగా విరాజిల్లింది. ఒకప్పుడు జిల్లా కేంద్రంగా ఉండేది.

కల్పించాల్సిన సౌకర్యాలు : ఎలగందుల ఖిల్లా చారిత్రక ప్రాంతం కావడంతో ప్రభుత్వం 2014లో పర్యాటక కేంద్రంగా ప్రకటించి.. సౌండ్ అండ్ లైట్ షో ఏర్పాటు చేశారు. అయితే కొద్ది రోజులకే నిలిచిపోయింది. సామగ్రి దెబ్బతింది. పర్యాటకంగా అభివృద్ధి చెందాలంటే గార్డెన్స్, పార్కులు, రెస్టారెంట్లు, రవాణా సౌకర్యాలు, వసతులు కల్పించాల్సి ఉంది. కోట గురించి ఈతరం వారికి తెలియజేసేలా తీర్చిదిద్దాలి.

ప్రదేశం: మొలంగూరు ఖిల్లా, కేశవపట్నం మండలం, కరీంనగర్ జిల్లానిర్మించినది : ప్రతాపరుద్రుని అధికారులలో ఒకరైన వొరగిరి మొగ్గరాజు దీనిని నిర్మించాడు.

ప్రత్యేకత : దూద్ బావి బహుళ ప్రాచుర్యం

కల్పించాల్సిన సౌకర్యాలు : గుట్టపైన, కింద కోనేరులు.. దూద్ బావి, శివాలయం, వీరభద్రాలయం, కోట బురుజులు, రాతి ద్వారాలు, కందకాలు, ఫిరంగులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఇక్కడి దూద్ బావిలోని నీరు ఏ కాలంలో అయినా పాల వలె తెల్లగా ఉంటాయి. ఈ నీరు ఆరోగ్యానికి మంచిదని అక్కడి గ్రామస్థులు తీసుకెళతారు.. ఈ ప్రాంతంలో సుందరీకరణ పనులు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రదేశం: రామగిరి ఖిల్లా, కమాన్‌పూర్ మండలం బేగంపేట, పెద్దపల్లి జిల్లా

నిర్మించినది : శాతవాహనులు నిర్మించారని చారిత్రక అధారాలు చెబుతున్నాయి. వారు దీనిని రక్షణ కోటగా వినియోగించుకొని కోటి లింగాలను రాజధానిగా చేసుకొని పాలించారు.

ప్రత్యేకత : శత్రుదుర్భేద్యమైన ఈ కోట అరుదైన శిల్పకళ, బురుజులకు నిలయం. కోట పరిసర ప్రాంతాల్లో వనమూలికల సంపత్తి, అరుదైన వృక్షాలున్నాయి.

కల్పించాల్సిన సౌకర్యాలు : ఇక్కడ వనమూలికలు, అరుదైన వృక్షాలను చూసేందుకు వివిధ రాష్ట్రాల శాస్త్రవేత్తలు, ఆయుర్వేద నిపుణులు ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వస్తారు. ఈ కోటకు అన్ని రకాలు వసతులు, సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేస్తే ఉమ్మడి జిల్లాలోనే సుందరమైన ప్రదేశంగా విరాజిల్లుతుంది. వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థులకు బొటానికల్ పర్యటన క్షేత్రంగా మారనుంది.

ప్రదేశం: కరీంనగర్ మానేరు జలాశయం

సాగు, తాగు నీటి అవసరాలు తీర్చేందుకు కరీంనగర్‌లో మానేరు డ్యాం నిర్మాణం చేశారు. ఈ డ్యాంను ఆనుకొని ప్రభుత్వం ఉజ్వల, జింకల పార్కులు, హరిత హొటల్ నిర్మించారు.

కల్పించాల్సిన సౌకర్యాలు: మానేరు డ్యాంపై నీడ వసతి, ఫుడ్ కోర్టులు పెరగాల్సిన అవసరముంది. కొదురుపాక మధ్య మానేరులోనూ వసతులు, సౌకర్యాలు పెంచితే బోటింగ్‌కు సందర్శకుల సంఖ్య పెరగనుంది. ఉజ్వల, జింకల పార్కులను మరింత ఆకర్షించేలా తీర్చిదిద్దాలి.

హరిత హొటల్‌ను త్వరితగతిన పూర్తి చేయాల్సి ఉంది. ఇస్కాన్ టెంపుల్, తితిదే వేంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణంతోపాటు మానేరు రివర్ ఫ్రంట్, తీగల వంతెన ప్రాంతాలను తీర్చిదిద్దితే జిల్లాలో పర్యాటకులు పెరగనున్నారు. కోటి రూపాయాలతో తయారైన క్రూజ్ పడవను త్వరలో నడిపించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ప్రదేశం: వేములవాడ శ్రీరాజరాజేశ్వర దేవాలయం

నిర్మించినది : పశ్చిమ చాళుక్య చక్రవర్తి ఆరో విక్రమాదిత్యుని మహా మండలేశ్వరుడైన రాజాదిత్యుడు రాజరాజేశ్వర దేవాలయం నిర్మించాడని శిలాశాసనం ద్వారా తెలుస్తుంది.

ప్రత్యేకత : దక్షిణ కాశీగా విరాజిల్లుతుంది. వివిధ రాష్ట్రాలకు చెందినవారు ఇక్కడి దర్శనానికి వస్తుంటారు.

కల్పించాల్సిన సౌకర్యాలు : ప్రసాద్ లాంటి కేంద్ర పథకాలు వేములవాడతోపాటు కొండగట్టు, ధర్మపురి, ఇల్లందకుంట దేవాలయాలకు వర్తింపజేయాలి. రాష్ట్ర ప్రభుత్వం సైతం మరిన్ని నిధులు మంజూరు చేసి మెరుగైన సౌకర్యాలు, వసతులు కల్పించాలి. రవాణా పరంగా రైల్వేలైన్ వేయాల్సి ఉంది.

ప్రదేశం: గోదావరిఖని గనులు

సహజ నిక్షేపాలుగా బొగ్గు గనులు బయటపడ్డాయి.

ప్రత్యేకత : భూగర్భ గనుల తవ్వకాలు, ఓపెన్ కాస్ట్ మైనింగ్ పనులతోపాటు పవర్ ప్లాంట్‌లు ఉన్నాయి.

కల్పించాల్సిన సౌకర్యాలు : గతంలో ఆర్టీసీ, మైనింగ్ సంస్థలు కలిసి పర్యాటకుల సందర్శనకు అవకాశం కల్పించారు. బస్సు సర్వీసు ద్వారా తీసుకొచ్చి ఖనిలో జరుగుతున్న బొగ్గు గనుల తవ్వకాలు, ఈ ప్రాంత విశేషాలు చూపించేవారు. అనంతరం నిలిపివేశారు. పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

# మేం..డిజిటల్ సర్వే చేయలేం..!



కొత్తగూడెం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'డిజిటల్ పంట సర్వే'కు ఆదిలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పంటల సర్వే బాధ్యతలను వ్యవసాయ విస్తరణాధికారులకు సర్కారు అప్పగించింది. ఈమేరకు శిక్షణ, యాప్‌లను ఏఈఓలకు అందించింది. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సర్వే ప్రారంభించాల్సి ఉండగా.. పని ఒత్తిడి, సిబ్బంది కొరత వంటి కారణాలతో సర్వే చేయలేమంటూ ఏఈఓలు చేతులెత్తేస్తున్నారు. వ్యవసాయ శాఖలోని 49 రకాల పనులు చేస్తూనే.. డిజిటల్ సర్వే నిర్వహించటం అసాధ్యమంటున్నారు. పంటల సాగు విస్తీర్ణాన్ని బట్టి తమకు సహాయక సిబ్బందిని నియమిస్తే సర్వే చేస్తామని చెబుతున్నారు.

ఎందుకీ పంట సర్వే..?

భవిష్యత్తులో దేశవ్యాప్తంగా ఆహారభద్రత, పంటల బీమాతోపాటు ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే పంట నష్టాన్ని అంచనా వేయటం, ఆహార ధాన్యాల ఎగుమతి, పంటల కొనుగోలు, సాగు ప్రణాళిక, మార్కెటింగ్ తదితరాలకు డిజిటల్ పంట సర్వే ముఖ్యభూమిక పోషించనుంది. ఇందులో భాగంగా వ్యవసాయ రంగంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(డీపీఐ)ని రూపొందించే లక్ష్యంతో 'డిజిటల్ ఆగ్రి మిషన్' పథకాన్ని కేంద్రం తీసుకొచ్చింది. దీని అమలుకు రూ.2,817 కోట్లు వెచ్చిస్తోంది. రైతులకు ప్రయోజనం చేకూర్చటానికి, వ్యవసాయ సామర్థ్యాన్ని పెంచటానికి ఆధునిక సాంకేతికతను వినియోగించనుంది. రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈకార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తుంది.

పక్క రాష్ట్రాల్లో ఇదీ పరిస్థితి

ఆంధ్రప్రదేశ్‌లో 1,000–1,500 ఎకరాల వరకు ఒక గ్రామ వ్యవసాయ సహాయకుడిని అక్కడి ప్రభుత్వం నియమించింది. గ్రామస్థాయిలో వివిధ వ్యవసాయ సర్వేలు, ప్రభుత్వ పథకాల అమలులో లబ్ధిదారులైన రైతులను గుర్తించటం, ధ్రువపత్రాల సేకరణ, రైతు సమావేశాల నిర్వహణ వంటి విధులు నిర్వర్తించటంతో వ్యవసాయ విస్తరణ సేవలు అన్నదాతలకు మరింత చేరువయ్యాయి. మహారాష్ట్ర, ఒడిశాలో టెండర్ ప్రక్రియ ద్వారా ప్రైవేటు కంపెనీలకు డిజిటల్ పంట సర్వే బాధ్యతలు అప్పగించారు. కర్ణాటకలో ఒప్పంద ప్రాతిపదికన సిబ్బందిని నియమించి సర్వే చేయిస్తున్నారు. తమిళనాడులో వ్యవసాయ విద్యనభ్యసించిన వారిని రోజువారీ వేతనంతో పనిచేయించుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వ సూచనల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం గ్రామ వ్యవసాయ సహాయకులను నియమిస్తే సర్వే చేయటానికి సిద్ధమని ఏఈఓల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్‌గౌడ్, సురేష్‌రెడ్డి చెబుతున్నారు.

సిబ్బంది కొరతే సమస్య


ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 196 మంది వ్యవసాయ విస్తరణ అధికారులు(ఏఈఓలు) పనిచేస్తున్నారు. వీరి పరిధిలో సుమారు 11.56 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. ప్రతి 5వేల ఎకరాలకు ఒకరి చొప్పున 232 మంది ఏఈఓలు అవసరం. ఉభయ జిల్లాల్లో దాదాపు 50 శాతం క్లస్టర్లలో సాగు భూమి 5వేల ఎకరాలకు మించి ఉంది. ఇల్లెందు మండలం కొమురారం క్లస్టర్‌లో ఒక్క ఏఈఓ పరిధిలో సుమారు 29వేల ఎకరాల సాగు భూమి ఉండటం గమనార్హం. డిజిటల్ సర్వేలో భాగంగా సదరు ఏఈఓలు తమ పరిధిలోని అన్ని పంట పొలాల్లోని సర్వే నంబర్లలోకి వెళ్లి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉంటుంది.

# వేదన మిగిల్చిన నైరుతి

ఖమ్మం : ఈ ఏడాది ఖమ్మం, భద్రాద్రి జిల్లాల వాసులకు నైరుతి రుతుపవనాలు వేదన మిగిల్చాయి. వీటి ప్రభావంతో జూన్ రెండో వారం నుంచి ఇప్పటివరకు కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. ఆగస్టు రెండో వారం వరకు మోస్తారు వర్షపాతం నమోదైనా.. ఆతర్వాత తుపాను ప్రభావంతో కుండపోత వానల వల్ల ఉభయ జిల్లాల్లో జనజీవనం అస్తవ్యస్తమైంది. జూన్ మొదటి వారంలో రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించగా.. అదేనెల 15 నుంచి పూర్తిస్థాయిలో విస్తరించాయి. ఈనెలాఖరున నిష్క్రమిస్తాయని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. ఈసారి కురిసిన వర్షాలకు జలాశయాలు నిండుకుండలను తలపిస్తున్నాయి. ఉభయ జిల్లాల్లో పదుల సంఖ్యలో కాలనీలు జలమయమయ్యాయి. రహదారులు, కల్వర్టులు, వంతెనలు దెబ్బతినగా.. వేలాది ఎకరాల్లోని పంట పొలాల్లో ఇసుక మేటలు వేసి అన్నదాతలకు కడగండ్లు మిగిల్చాయి.

ఘొల్లుమన్న ఖమ్మం

నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలు నమోదయ్యాయి. జిల్లాలో వానాకాలంలో సాధారణ వర్షపాతం 783.8 మిల్లీమీటర్లు కాగా.. 1,128.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. తిరుమలాయపాలెం, కల్లూరు, వేంసూరు, మధిర ప్రాంతాల్లో 60శాతానికి పైగా అధికంగా వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా ఏన్కూర్ మినహా మిగతా మండలాల్లో మిగులు వర్షపాతం నమోదైంది. ప్రధానంగా ఈనెల మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలకు ఆకేరు, మున్నేరు నదులు పొంగటంతో అనేక ప్రాంతాల్లో సాధారణ ప్రజలు, అన్నదాతలతో పాటు ప్రభుత్వ ఆస్తులకు తీరని నష్టం వాటిల్లింది. ప్రాణనష్టమూ సంభవించింది.



మునిగిన మణుగూరు.. తెగిన పెద్దవాగు

ఖమ్మం జిల్లాతో పోల్చితే నైరుతి రుతుపవనాల ప్రభావం భద్రాద్రి జిల్లాలో తక్కువైనప్పటికీ కొన్నిచోట్ల కురిసిన భారీ వర్షాల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జులైలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పెద్దవాగు ప్రాజెక్టుకు గండిపడటంతో గుమ్మడివల్లి, తుపాను ప్రభావం వల్ల మణుగూరు, బుగ్గవాగు పొంగటంతో ఇల్లెందులోని కొన్ని కాలనీల్లోకి వరదనీరు చేరి ప్రజలు నిరాశ్రయులయ్యారు. భద్రాద్రి జిల్లాలో ఈ ఏడాది సాధారణ వర్షపాతం 947 మిల్లీమీటర్లు కాగా.. 1,240.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. ప్రధానంగా మణుగూరు, ఆళ్లపల్లిలో సాధారణం కంటే 60 శాతానికి పైగా వర్షం కురిసింది. 23 మండలాల్లో పదకొండు మండలాల్లో సాధారణ, 10 మండలాల్లో మిగులు వర్షపాతం నమోదైంది.

# పనులు వేగవంతం.. రాకపోకలు సులభతరం

తాండూరు :రహదారులు, వంతెనల నిర్మాణాలు సకాలంలో పూర్తయితే రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. అధికారుల తాత్సారం, గుత్తేదారు నిర్లక్ష్యం తదితర కారణాలతో పనులు కొలిక్కి రాకపోతే వర్షాకాలంలో ప్రజల రాకపోకలు నిలిచి అవస్థలు పడాల్సి వస్తుంది. తాండూరు– సంగారెడ్డి మార్గంలో ఏళ్ల తరబడి ఇలాంటి పరిస్థితే నెలకొంది. సమస్యను స్థానికులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ప్రత్యేక చొరవ చూపి రోడ్డు నిర్మాణ పనులకు మార్గం సుగమం చేశారు.

మట్టిపోసినా కుంగిపోయింది

తాండూరు నుంచి సంగారెడ్డి వెళ్లే మార్గంలో గాజీపూరు, బుద్దారం వాగులపై వంతెనల నిర్మాణానికి 2016లో ప్రభుత్వం రూ.9 లక్షల నిధులను మంజూరు చేసింది. అప్పటి నుంచి నిర్మాణ పనులు సాగుతున్నాయి. బుద్దారం వాగుపై వంతెన నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చారు. గాజీపూరు వాగుపై వంతెన పనులు మాత్రం ఒక అడుగు ముందుకు పడితే నాలుగు అడుగులు వెనక్కి అన్నట్లు సాగుతున్నాయి. వంతెన నిర్మాణ సమయంలో గుత్తేదారు చేతులు ఎత్తేశారు. మరో గుత్తేదారుకు అప్పగించారు. ఏడాది క్రితం వంతెన పనులు పూర్తి చేశారు. తాత్కాలికంగా మట్టిని పోసి రాకపోకలు సాగించే విధంగా చర్యలు తీసుకున్నారు. వర్షాలకు మట్టి దిగబడి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. శిథిలమైన పాత వంతెన పైనుంచి ప్రయాణాలు సాగాయి. భారీ వర్షాలకు ఆ వంతెన పైనుంచి



సైతం రాకపోకలు నిలిపివేశారు.

అత్యవసర సమయంలో పడరాని పాట్లు

భూ సమస్య వల్ల వంతెన నిర్మాణ పనులు చాలా కాలం కొనసాగలేదు. దీంతో వానా కాలంలో వాగులు పొంగితే చాలు ప్రజలు ఇబ్బందులకు గురయ్యేవారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, ప్రమాదాలకు గురైన వారు సకాలంలో ఆసుపత్రులకు చేరలేకపోయారు. వాగుల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. తాండూరు నుంచి వివిధ ప్రాంతాలు రవాణా చేసే సిమెంటు, నాపరాయి లారీలు రోజుల తరబడి ఆగిపోయేవి. జాతీయ రహదారి 65కు ఈ మార్గం అనుసంధానం కావడంతో సరకు రవాణా చేసే వాహనాలు, వ్యాపారులు కూడా అవస్థలు పడేవారు. ప్రస్తుతం గాజీపూరు వంతెన అనుసంధాన పనులు వేగంగా సాగుతున్నాయి. ఎత్తుగా ఉన్న వంతెనకు సమాంతరంగా మట్టిని పోసి చదును చేస్తున్నారు. సుమారు వంద మీటర్ల దూరం నుంచి మట్టితో కలుపు రోడ్డును వెడల్పు చేస్తున్నారు. ఎప్పటికప్పును యంత్రాలతో తొక్కిస్తూ మట్టిని గట్టిపరుస్తున్నారు. కింది నుంచి వెళ్లే మార్గాన్ని పూర్తి తొలగించారు. మట్టి గట్టి పడగానే కంకర పనులు చేయనున్నారు. తారు వేసి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెస్తారు.

# ఆకాశ మార్గం..సుగమం

తాండూరు :రాజధాని నుంచి రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు వెళ్లేందుకు కీలకమైన రెండు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం విషయంలో రక్షణ శాఖతో ఏర్పడిన ప్రతిష్టంభనకు పరిష్కారం దొరికొంది. వీటి నిర్మాణం కోసం తమ ఆధీనంలో ఉన్న 170 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చేందుకు రక్షణ శాఖ ఉన్నతాధికారులు అంగీకరించారు. దీనికి బదులుగా మరోచోట రక్షణ శాఖకు 400 ఎకరాలను ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది.

శామీర్‌పేట ఫైరింగ్ రేంజ్‌లో..

జేబీఎస్ నుంచి తూంకుంట వరకు దాదాపు 20 కిలోమీటర్ల మేర రాజీవ్ రహదారిలో ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టింది. నాగ్‌పూర్ జాతీయ రహదారిలో ప్యారడైజ్ నుంచి కొంపల్లి వరకు పది కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. రెండు వంతెనలను నిర్మించాలంటే రక్షణ శాఖ 170 ఎకరాలను ఇస్తేనేగానీ ఈ ప్రాజెక్టు ముందుకు వెళ్లని పరిస్థితి. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సమస్య గురించి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో చర్చించారు. వీటికి స్థలాలను



ఇచ్చేందుకు కేంద్రమంత్రి అంగీకరించారు. బదులుగా మూడింతల స్థలం తమకు నగర పరిధిలోనే ఇవ్వాలని రక్షణ శాఖ కోరింది. ఈనేపథ్యంలో రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ రక్షణ శాఖ అధికారులతో చర్చించారు. శామీర్‌పేట ఫైరింగ్ రేంజ్‌లో 400 ఎకరాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకురావడంతో రక్షణ శాఖ అధికారులు ఆమోదం తెలిపారు.

ఆరెకరాలకు.. పరిహారం..లంగర్‌హౌస్‌లో రోడ్డు వెడల్పు ప్రక్రియ,మెహిదీపట్నంలో స్కైవాక్ పనులు ఆగిపోయాయి. దీనికి రక్షణ శాఖకు చెందిన ఆరెకరాల స్థలం అవసరం. అది ఇస్తే రూ.400 కోట్లు ఇవ్వాలని రక్షణ శాఖ కోరింది. దీనికి సంబంధించి కూడా శామీర్‌పేటలో స్థలాన్ని తీసుకునేందుకు రక్షణ శాఖ అంగీకరించింది. ఎలివేటెడ్ కారిడార్‌పై ఉన్నతాధికారుల సమావేశంరాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్ మీదుగా చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్ల అంశంపై కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో ఉన్నతాధికారులు సమావేశమైనట్లు తెలిసింది. రక్షణ శాఖ ఉన్నతాధికారులు, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి హాజరైనట్లు సమాచారం. రక్షణశాఖకు సంబంధించిన భూములను కేటాయించేందుకు అంగీకరించినట్లు తెలిసింది. ఏవోసీ సెంటర్ చౌరస్తాకు అనుసంధానంగా ఉన్న వివిధ రహదారులకు ప్రత్యామ్నాయంగా నిర్మించాలనుకున్న రహదారి ప్రస్తావన వచ్చిందని తెలిసింది.

# ఇంధన పోటీలు..!

నల్గొండ : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఇంధన వనరులపై ఆసక్తి పెంచేలా చేయడం, వాటి పరిరక్షణపై అవగాహన లక్ష్యంగా రెడ్కో సంస్థ చిత్ర లేఖన పోటీలకు శ్రీకారం చుట్టింది. కేంద్ర విద్యుత్తు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయివరకు పోటీలను నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యార్థుల నుంచి జూనియర్, సీనియర్ విభాగాలుగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులంతా ఇందులో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు.

అక్టోబరు 20 లోగా దరఖాస్తులు..

ఆసక్తి ఉన్న విద్యార్థులు అక్టోబరు 20వ తేదీ నాటికి దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. 'ఎ', 'బి', గ్రూపులుగా పోటీలుంటాయి. 'ఎ' గ్రూపులో 5, 6, 7 తరగతుల విద్యార్థులు, 'బి' గ్రూపులో 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉంటారు. ప్రతి విద్యార్థి తమ పెయింటింగ్స్ ఎ-4 పేపర్‌లోనే వేయాల్సి ఉంటుంది. అక్టోబరు చివరి వారంలో జిల్లా స్థాయి పోటీలు ఉంటాయి.

టీఎస్ రెడ్కో ఆధ్వర్యంలో నవంబరు 14న రాష్ట్ర స్థాయి పోటీలు ఉంటాయి. రెండు గంటల వ్యవధి ఉంటుంది. ఇందులో విజేతలుగా నిలిచిన వారికి మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో విజేతకు రూ.30 వేలు, మూడో బహుమతిగా రూ.20 వేలు అందిస్తారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి రూ.2 వేల నగదు, ప్రశంసాపత్రాలు అందజేస్తారు. డిసెంబరు 14న ఇంధన వనరుల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తారు. మొదటి మూడు బహుమతుల కింద వరుసగా రూ.లక్ష, రూ.50 వేలు, రూ.30 వేలు అందజేస్తారు. ల్యాప్‌టాప్ ఇస్తారు. టాప్ టెన్ వరకు నిలిచిన వారి వరకు రూ.15 వేల నగదు, ప్రశంసాపత్రం, ట్యాబ్‌లను అందిస్తారు. పోటీలు ఇంధన శక్తిని పరిరక్షించడం, పర్యావరణాన్ని కాపాడటం.. శక్తి సంరక్షణే పర్యావరణ సంరక్షణపై నిర్వహిస్తారు.

విద్యార్థులకు మంచి అవకాశం..

చిత్రలేఖనంలో రాణించే విద్యార్థులకు ఇది మంచి అవకాశం. ఇంధనం శక్తి పర్యావరణానికి సంబంధించి పెయింటింగ్స్ వేసి జాతీయ స్థాయి వరకు వెళ్లొచ్చు. విజేతలకు మంచి బహుమతులున్నాయి. పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. చిత్రలేఖన పోటీల విషయమై ఇప్పటికే కలెక్టర్లు, డీఈవోలకు లేఖలు పంపాం. పాండు రంగారావు, రెడ్కో సంస్థ ఉమ్మడి జిల్లా మేనేజర్

# ఏరు పారినా.. నీరుండదు..!

నల్గొండ : ఎంత వర్షం కురిసినా.. వాగులు, వంకలు పారినా ఇక్కడి చెరువులు నిండవు.. ఈ ప్రాంత కరవు తీరదు. ఎందుకీ దుర్భిక్షం.. ఎక్కడుందీ నిర్లక్ష్యం.. సాగునీటి వనరులు లేక పూర్తిగా వర్షాధారంపైనే పంటలు పండించే నాంపల్లి మండల రైతులకు వాన నీటిని ఒడిసి పట్టే వనరులు లేకపోవడంతో నీరు వృథాగా పోతోంది. వానాకాలంలో అడపాదడపా కురిసే వర్షాలతో చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతుందని ఆశించే అన్నదాతలకు ఏటా నిరాశే మిగులుతోంది. అత్యంత విలువైన వర్షపు నీరు చెరువుల్లోకి మళ్లించే పరిస్థితులు లేకపోవడంతో వాగు పాలవుతోంది. ఇటీవల భారీ వర్షాలు పడినా ప్రధాన చెరువుల్లో నీరు చేరలేదు. బోర్లు అప్పుడే ఆగి పోస్తున్నాయి. నాంపల్లి, పెద్దాపురం చెరువులు 2013 నుంచి ఇప్పటివరకు అలుగు పోయలేదంటే పరిస్థితులు అర్థం చేసుకోవచ్చు.

పదిహేనేళ్ల క్రితం ఫీడర్ ఛానల్ పునరుద్ధరణకు అప్పటి ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసింది. రూ.90 లక్షలతో నెమిళ్లగూడెం వద్ద శేషిలేటి వాగుపై ఫీడర్ ఛానల్ ఏర్పాటుకు చెక్ డ్యాం నిర్మించి, రూ.10 లక్షలతో ఫీడర్ ఛానల్ కాలువ పనులకు శ్రీకారం చుట్టారు. కానీ అప్పటి రాజకీయ పరిస్థితుల కారణంగా పనులు అర్థంతరంగా నిలిపివేశారు. ఏటా శేషిలేటి వాగు పొంగి ప్రవహిస్తున్నా చెరువులకు చుక్క నీరు చేరడంలేదు. ఇటీవల రాష్ట్రమంతటా భారీ వర్షాలు కురిశాయి. మండలంలోని శేషిలేటి వాగూ పొంగి ప్రవహించినప్పటికీ చెరువులు జలకళకు నోచుకోలేదు. ఫీడర్ ఛానల్ పనులు పూర్తయితే నాంపల్లి, పెద్దాపురం చెరువులు జలకళ సంతరించుకోవడంతోపాటు సుమారు 700 ఎకరాల ఆయకట్టు భూములు సాగులోకి వచ్చే అవకాశం ఉంది. భూగర్భ జలాలు పెరిగి మండలంలో తాగు, సాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

చెరువులకు చేరని వాన నీరు.. నాంపల్లి మండలంలో ప్రధానంగా శేషిలేటి వాగు, పులుసు వాగులున్నాయి. చింతపల్లి మండలం నుంచి ప్రవహించే పులుసువాగు మండలంలోని పస్నూరు పెద్ద చెరువులో కలుస్తుంది. శేషిలేటివాగు మర్రిగూడ మండలం నుంచి ప్రారంభమై మండలంలోని దామెర, నెమిళ్లగూడెం, రాందాస్‌తండా, చామలపల్లి, గానుగుపల్లి గ్రామాల ద్వారా ప్రవహించి గుర్రంపోడు మండలంలోని చేపూరు చెరువులో కలుస్తుంది. స్థానికంగా కురియకున్నా.. పై మండలాల్లో కురిసిన వర్షాలకు ఏటా ఈ వాగుల్లో నీరు ప్రవహిస్తోంది. పులుసు వాగు ద్వారా పస్నూరు పెద్దచెరువుకు ఏటా కొద్దోగొప్పో నీరొచ్చి చేరుతోంది. ఇక నాంపల్లి నాగుల, పెద్దాపురం పెద్ద చెరువులను నింపేందుకు నిజాం కాలంలోనే ఫీడర్ ఛానల్ నిర్మించారు. దీని కాలువ భూములను ఆక్రమించి చదును చేసి సాగుకు అనుకూలంగా మలుచుకోవడంతో దశాబ్ధాలుగా ఈ చెరువులకు నీరు చేరడంలేదు.

# డైరెక్టర్ల స్థానాలు దక్కేదెవరికో..!

భువనగిరి : నల్గొండ- రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ల ఎన్నిక ఈ నెల 13న జరగనుంది. ఖాళీగా ఉన్న ఆరు స్థానాలకు పోటీ తీవ్రంగా ఉంది. ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి నాలుగు, రంగారెడ్డి జిల్లా నుంచి రెండు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. జిల్లా నుంచి ఒగ్గు భిక్షపతి, కల్లెపల్లి శ్రీశైలం, గుడపాటి మధుసూదన్‌రెడ్డి, డి.సోమిరెడ్డి, పుష్పాల నర్సింహులు, బత్తుల నరేందర్‌రెడ్డి, ఎస్.భాస్కర్, ఎం కొండల్‌రెడ్డి పోటీలో ఉన్నారు. రంగారెడ్డి జిల్లా నుంచి నలుగురు బరిలో ఉన్నారు. అత్యధిక స్థానాలు గెలుచుకుని డెయిరీ ఛైర్మన్ పీఠం కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. అధికార పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించేందుకు అన్ని రకాలు ప్రయత్నాలు చేస్తున్నారు. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష భారాస తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు క్యాంపు రాజకీయాలకు తెరదీశాయి. 297 మందికి ఓటు..సంఘంలో 348 మంది సభ్యులుగా ఉండగా.. 297 మంది పాల సంఘాల సొసైటీ ఛైర్మన్లకు ఓటు హక్కు ఉంది. వీరంతా ఈ నెల 13న హయత్‌నగర్‌లోని మదర్‌డెయిరీ కార్యాలయంలో ఆరు డైరెక్టర్ స్థానాలకు తమ ఓటు వేయనున్నారు. డెయిరీలో మొత్తం 15 స్థానాలు ఉంటాయి. ప్రతి సంవత్సరం రొటేషన్ పద్ధతిలో మూడు స్థానాలు ఖాళీ అవుతుంటాయి. ఖాళీ అయిన వాటికి ఎన్నికలు నిర్వహిస్తుంటారు. గతేడాది ఖాళీ అయిన మూడు స్థానాలకు ఎన్నికల నిర్వహించకపోవడంతో మొత్తం ఈ ఏడాదితో కలుపుకొని ఆరింటికి ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఎన్నికైన ఒక్కో డైరెక్టర్ ఐదేళ్లు కొనసాగుతారు. ప్రస్తుత ఎన్నిక అనంతరం 14వ తేదీన ఛైర్మన్ ఎన్నిక జరగనుంది.

# నగరంలో కీలకం.. ప్రయాణ నరకం



కరీంనగర్ : నగరంలో నిత్యం రద్దీగా ఉండే అనుసంధాన రహదారి అది. ఈ మార్గాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రారంభించిన పనులు అర్ధంతరంగా వదిలేయడంతో రాకపోకలకు అవస్థలు ఎదురవుతున్నాయి. కోతిరాంపూర్ నుంచి కట్టరాంపూర్ వెళ్లే అంతర్గత రహదారిపై ప్రయాణించాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోంది.

నగరపాలక సంస్థ పరిధిలో రహదారులు, మురుగుకాలువలు, తాగునీటి పైపులైన్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి హామీ నిధులు(సీఎంఏ) రూ.132.94 కోట్లు కేటాయించారు. గతేడాది అక్టోబరులో నగరవ్యాప్తంగా పనులు ప్రారంభించారు. ఇందులో కొన్ని డివిజన్‌లలో పూర్తి చేయగా, చాలా ప్రాంతాల్లో అసంపూర్తిగా వదిలేశారు. కట్టరాంపూర్ నుంచి కోతిరాంపూర్ వరకు అనుసంధాన రహదారి రెండు కిలోమీటర్లుండగా సగం మేర నిర్మించి వదిలేశారు.

గుంతలతో నరకయాతన

కోతిరాంపూర్ నుంచి కట్టరాంపూర్, భగత్‌నగర్, దోబీవాడ, గణేశ్‌నగర్, తిరుమల్‌నగర్, హనుమాన్‌నగర్, కలెక్టరేట్, ముకరంపుర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇది దగ్గరి దారి. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా గమ్యం చేరుకోవచ్చు. ఈ మార్గంలో రహదారి నిర్మాణానికి గతంలో ఉన్న సీసీని తవ్వారు. పనులు చేయకపోవడంతో గుంతలు పడ్డాయి. పైపు లైన్లు పగిలి తాగునీరు లీకవుతోంది. వర్షం పడితే రోడ్డంతా బురదమయంగా మారుతోంది. రహదారి దుస్థితిపై ఇటీవల వినాయకచవితి సందర్భంగా స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. కొందరు మొరం, కంకరపొడి తీసుకొచ్చి పోసుకున్నారు.

వినతుల వెల్లువ

కట్టరాంపూర్-కోతిరాంపూర్ రహదారి అధ్వానంగా మారడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రహదారి పనులు పూర్తి చేయాలని కోరుతూ స్థానికులతో పాటు కార్పొరేటర్ ఆకుల నర్మద, నర్సయ్య పలుమార్లు మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ పమేలా సత్పతి, కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఫలితం లేకపోవడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు

కట్టరాంపూర్ వైపు రహదారి నిర్మాణానికి ఏడాది కిందట తవ్వారు. బాగున్న రోడ్డును చెడగొట్టారు. పెద్ద, పెద్ద గుంతలతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఎవరికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఈ సమస్యపై ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తాం. చంద్రశేఖర్, కాలనీవాసి

వాహనాలు దిగబడుతున్నాయికోతిరాంపూర్-కట్టరాంపూర్ రహదారిని మరమ్మతులు చేయకుండా వదిలేశారు. ఊరంతా చేసి ఇక్కడ మాత్రం పట్టించుకోవడం లేదు. వర్షం పడితే గుంతలు ఏర్పడుతున్నాయి. అందులో వాహనాలు దిగబడుతున్నాయి. పైపులైన్లు లీకవుతున్నా పరిష్కరించడం లేదు. రాజ్‌కుమార్, స్థానికుడు

# నిర్లక్ష్యం పెరిగి.. భూగర్భ జలం తరిగి..



కరీంనగర్ : నగరాలు, పట్టణాల్లో రోజురోజుకు జనాభా ఎక్కువవుతుండగా శివారు ప్రాంతాల్లో ఇళ్ల సంఖ్య పెరుగుతోంది. ఖాళీ స్థలాలన్నీ మాయమవుతుండటంతో వర్షం నీరు భూమిలోకి ఇంకడం లేదు. పైగా నీటి సంరక్షణపై ఎవరూ దృష్టి సారించడం లేదు. ప్రతి ఇంటిలో బోరు తవ్వుకోవడం, నీటిని వినియోగించుకోవడం ఎక్కువ అవుతోంది. వృథా నీరంతా కాలువల గుండా వెళ్లిపోతుండటంతో భూగర్భ జలాలు ఏటా తగ్గుతున్నాయి. ఇళ్లలో ఇంకుడుగుంతలు నిర్మించాలన్న ఆదేశాలున్నా ఎవరూ పాటించడం లేదు. తాజాగా పురపాలక శాఖ 300 చ.మీ.ల విస్తీర్ణంలో ఉన్న ప్రతి ఇంటిలో ఇంకుడుగుంత నిర్మించాలని ఆదేశించింది. ఈసారైనా ఆదేశాలు అమలవుతాయా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

గతేడాది వర్షాలు ఆశించిన స్థాయిలో కురియకపోవడంతో ఈ ఏడాది వేసవి ప్రారంభంలోనే తాగు, సాగునీటికి ఇబ్బందులు పడ్డారు. వర్షాలు సైతం ఆలస్యంగా కురియడంతో కాస్త నీటి నిల్వలు పెరిగినప్పటికి.. భూగర్భ జలాలు పెంచుకోవాలనే ఆవశ్యకతను గుర్తించడం లేదు. కరీంనగర్, రామగుండం నగరాలతో పాటు మున్సిపాలిటీల్లో కచ్చితంగా ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని పేర్కొంటున్నా పట్టించుకోవడం లేదు. కొత్తగా ఇళ్లను నిర్మించుకునే వారు సైతం ఆ వైపే దృష్టిసారించడం లేదు.

అనుమతులకే పరిమితం

ఇంటి నిర్మాణ సమయంలో అనుమతులు తీసుకునే సమయంలో పట్టణ ప్రణాళిక విభాగంలో కొంత మొత్తాన్ని ఇంటి యజమానులు ఫీజు చెల్లిస్తున్నారు. చదరపు మీటర్ చొప్పున సుమారు రూ.2 వేల వరకు డిపాజిట్ చేస్తున్నారు. ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత ఇంకుడుగుంత నిర్మిస్తే ఈ మొత్తాన్ని చెల్లిస్తారు. ఎక్కడా ఆ నిబంధనలు అమలు కావడం లేదు. అనుమతులు ఇచ్చిన అధికారులు దానిని నిర్మించారా? లేదా? అనేది మాత్రం పరిశీలించడం లేదు. పైగా రూ.లక్షల్లో జమ అయిన ఆ మొత్తాన్ని ఇతర అవసరాలకు ఇన్నాళ్లు వినియోగిస్తున్నారు.

300ల చదరపు మీటర్లకు తప్పనిసరి

మున్సిపాలిటీలు, నగరాల్లో 300 చదరపు మీటర్లకు మించిన అన్ని నిర్మాణాల్లో ఇంకుడుగుంత తప్పనిసరి చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

ఇప్పటికే ఉన్న భవనాల్లో ఏడాదిలో నిర్మించుకోవాలి.

ఆక్యుపెన్సీ కం కంప్లీషన్ సర్టిఫికెట్ ఇచ్చేటప్పుడు ఇంకుడుగుంత నిర్మించారా లేదా క్షేత్రస్థాయిలో పరిశీలించాలి.

వీటిని నిర్మించుకునేలా ప్రజల్లో చైతన్యం తెచ్చే బాధ్యత కూడా మున్సిపల్ కమిషనర్లదేనని ఉత్తర్వులో వివరించారు.

కరీంనగర్ నగర పరిధిలో 300 చదరపు మీటర్లు ఉన్న భవనాలు 791 ఉన్నట్లుగా ఇటీవల నిర్వహించిన సర్వేలో గుర్తించారు.

ఇప్పటికే 458 బహుళ అంతస్తులో నిర్మించుకున్నారు.

మిగతా333 భవన యజమానులకు నోటీసులు ఇచ్చారు. అందులో 24 భవనాల్లో కొత్తగా నిర్మించుకున్నారు.

స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో ప్రభుత్వ కార్యాలయాల్లో ఆధునాతన సాంకేతికను జోడించి ఇంకుడుగుంతలు నిర్మిస్తున్నారు.

నగర, పురపాలికలు 16
ట్యాంకు ఏరియాలు 1,634
మొత్తం ఇళ్లు 3,56,580
ఇంకుడు గుంతల లక్ష్యం : 32,835
నివాసిత గృహాలు 16,630
ప్రభుత్వ భవనాలు 14,571

# నిధుల దుర్వినియోగం

జగిత్యాల : జిల్లాలోని 6 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పీఏసీఎస్), 2 డీసీఎంఎస్ కేంద్రాల్లో నిధులు దుర్వినియోగమైనట్లు అధికారులు గుర్తించారు. సహకారశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఇతర జిల్లాల నుంచి వచ్చిన సహకారశాఖ ప్రత్యేక బృందాలు ఈ నెల 10 నుంచి 22 వరకు 6 ప్యాక్స్‌లు, 2 డీసీఎంఎస్ కేంద్రాల్లో తనిఖీలు జరిపారు. 2014-18, 2018-23 సంవత్సరాల్లో ఆయా సంఘాలు, కేంద్రాల్లో జరిగిన లావాదేవీలను తనిఖీ చేశారు. ఈ మేరకు తనిఖీ అధికారులు 23న కమిషనర్‌కు ఇచ్చిన నివేదిక ప్రకారం ధర్మపురి ప్యాక్స్‌లో రూ.1.62 కోట్లు, పెగడపల్లిలో రూ.1.81 కోట్లు, జైనలో రూ.1.55 కోట్లు, నంచర్లలో రూ.96.12 లక్షలు, తిమ్మాపూర్‌లో రూ.67.18 లక్షలు, గొల్లపల్లిలో రూ.53.58 లక్షలు దుర్వినియోగమైనట్లు గుర్తించారు. ధర్మపురి డీసీఎంఎస్ కేంద్రంలో రూ.6.46 లక్షలు, గొల్లపల్లి డీసీఎంఎస్ కేంద్రంలో రూ.13.07 లక్షలు దుర్వినియోగమైనట్లు తేల్చారు.

ప్యాక్స్‌ల ఆధ్వర్యంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా భవనాలు, గోదాములు, షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం, భూముల కొనుగోలు, పెట్రోలు పంపు నిర్వహణ, ధాన్యం సేకరణలో సామగ్రిని మార్కెటింగ్ శాఖ నుంచి కాకుండా నేరుగా కొనుగోలు చేయటం, వడ్ల కొనుగోలు ఖర్చును అధికంగా చూపటం, ఇతరత్రా నిధులను దుర్వినియోగం చేసినట్లు అధికారులు గుర్తించారు. జిల్లాలోని ఓ ప్యాక్స్‌లో రూ.2.85 కోట్లు దుర్వినియోగమైనట్లు గుర్తించగా మరో మూడు సంఘాల అధికారులు తనిఖీలకు భయపడి ఇటీవల రూ.50 లక్షల వరకు ప్రభుత్వానికి చెల్లించారు. ఈ మేరకు జిల్లాలోని మరికొన్ని సంఘాల్లో నిధుల దుర్వినియోగం జరిగినట్లు అధికారులు భావిస్తున్నారు. సహకారశాఖ రాష్ట్ర అధికారుల నిర్ణయం మేరకు జైన, ధర్మపురి,



తిమ్మాపూర్, నంచర్ల, పెగడపల్లి గొల్లపల్లి ప్యాక్స్‌ల కార్యదర్శులు సాగర్‌రావు, రాజేశ్, ప్రభాకర్, మధుకర్, గోపాల్‌రెడ్డి, రాంసుధాకర్‌రావులను సస్పెన్షన్‌కు ఆదేశాలు జారీచేశారు. ధర్మపురి, గొల్లపల్లి డీసీఎంఎస్ కేంద్రాల నిర్వాహకులపై చర్యలకు ఉన్నతాధికారులకు నివేదించారు.

నిబంధనల ప్రకారం చర్యలు

రాష్ట్ర స్థాయి అధికారులు ఆయా సంఘాల్లో తనిఖీలు చేపట్టగా కమిషనర్ ఆదేశాలు, సహకారశాఖ నిబంధనల ప్రకారం ఆరుగులు కార్యదర్శులపై చర్యలు చేపట్టారు. ఆయా ప్యాక్స్‌ల పాలకమండళ్లకు షోకాజ్ నోటీసులు జారీచేసి వారం రోజుల్లోగా తగిన సమాధానమివ్వకుంటే రద్దుకు చర్యలుంటాయి. ప్యాక్స్‌ల సర్వసభ్య సమావేశం నిర్వహించి చర్చించి తీర్మానాన్ని ప్రభుత్వానికి పంపించాలి. డీసీఎంఎస్ కేంద్రాల్లో ఉద్యోగులతో కాకుండా ప్రైవేటు వ్యక్తులతో పనిచేయించరాదు. రెండు డీసీఎంఎస్ కేంద్రాలపై చర్యలకు నివేదించాము. సీహెచ్.మనోజ్‌కుమార్, జిల్లా సహకారశాఖ అధికారి

# వృథా నీటికి అడ్డుకట్ట

మల్లాపూర్: ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ ద్వారా సరఫరా అవుతున్న సాగునీరు చివరి ఆయకట్టుకు పూర్తిస్థాయిలో అందక.. రైతులు పూర్తిస్థాయిలో పంటలు పండించుకోని పరిస్థితులు గతంలో ఉండేవి. వాగులపై నిర్మించిన చెక్‌డ్యాంలతో వేలాది ఎకరాల బీడు భూములు సస్యశ్యామలం కావడం, భూగర్భ జలాలు పెరగడంతో పాటు మత్స్యకారుల ఉపాధికి మార్గం సుగమమైంది. జిల్లాలోని పెద్దవాగులో వృథాగా పోతున్న జలాలను పంట పొలాలకు అందిస్తే ప్రయోజనం ఉంటుందన్న భావనతో చెక్‌డ్యాంల నిర్మాణంతో పలువురు రైతులు సాగు చేసుకుంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మెట్పల్లి, మల్లాపూర్, కోరుట్ల, రాయికల్ మండలాల మీదుగా ప్రవహిస్తున్న పెద్దవాగు, కోరుట్ల వాగులను ఆనుకోని మొత్తం 11 చెక్‌డ్యాంలను నిర్మించారు. మెట్పల్లి మండలం ఆత్మకూర్ వద్ద రూ.2.01 కోట్లు, పెద్దపూర్ గ్రామ శివారులో రూ.2.18 కోట్లు, అరపేట శివారులో రూ.2.36 కోట్లు, కొండ్రికర్ల వద్ద రూ.2.27 కోట్లు, చౌలమద్ది వద్ద రూ.2.22 కోట్లు, వెంపేట వద్ద రూ.3.15 కోట్లు, మల్లాపూర్ మండలం చిట్టాపూర్ శివారులో 3.74 కోట్లు, కోరుట్ల మండలం ధర్మారం శివారులో రూ.2.12 కోట్లు, అయిలాపూర్ శివారులో రూ.2.08 కోట్లు, రాయికల్ మండలం బొర్నపల్లి వద్ద రూ.3.20 కోట్లతో చేపట్టిన చెక్‌డ్యాంల నిర్మాణాలు పూర్తవడంతో జలకళను సంతరించుకొన్నాయి.



నిర్మాణాలు పూర్తవడంతో 5 ఎంసీఎఫ్‌టీ మేర నీటి నిల్వ సామర్థ్యం పెరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. భూగర్భ జలాలు పెరగడంతో రైతులకు రెండు పంటలకు సాగునీరు పుష్కలంగా అందనుంది. ఒక్కో చెక్‌డ్యాం ఎత్తు 9 నుంచి 11 ఫీట్ల మేర ఉండటంతో మత్స్యకారులు చేపలను పెంచుకునేందుకు మార్గం సుగమమైంది. గతంలో ఎస్సారెస్పీ కాలువల ద్వారా సాగునీరు అందని బీడు భూములకు చెక్‌డ్యాంల ద్వారా నేడు సాగునీరు అందనుంది.

రెండు పంటలకు సాగునీరు - సురకంటి అంజిరెడ్డి, చిట్టాపూర్ రైతు

ఎస్సారెస్పీ ప్రాజెక్టు పరిధిలో ఉన్నప్పటికీ గతంలో సాగునీరు అందక అనేక ఇబ్బందులు పడ్డాం. చిట్టాపూర్ శివారులో రెండేళ్ల కిందట నిర్మించిన చెక్‌డ్యాంతో ఖరీఫ్, రబీ సీజన్‌లలో వరి, మొక్కజొన్న పంటలను పండిస్తున్నాం. ప్రభుత్వం ముందు చూపుతో నిర్మించిన చెక్‌డ్యాంలతో రైతులతో పాటు మత్స్యకారులు చేపలను పెంచుతూ ఉపాధి పొందుతున్నారు.

# వైద్య సేవలు మరింత వేగవంతం

జమ్మికుంట: వైద్య విధానపరిషత్ పరిధిలోని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు మెరుగయ్యేందుకు జిల్లా పాలనాధికారి ప్రత్యేక దృష్టి సారించడంతో.. అనేక గ్రామాలకు కేంద్రమైన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఇబ్బందులు తీరనున్నాయి. కొన్ని నెలలుగా పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బంది కొరతతో ఇబ్బందులు తప్పడం లేదు. గత 6 మాసాలుగా గైనకాలిజిస్టు లేకపోవడంతో ఆసుపత్రిలో ప్రసవాలు నిలిపివేశారు. దీంతో గర్భిణులు హుజూరాబాద్ ప్రాంతీయ ఆసుపత్రి లేదా కరీంనగర్, వరంగల్‌లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. తాజాగా జిల్లా కలెక్టర్ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వారంలో రెండు రోజులు ప్రసవాలు చేసేందుకు గైనకాలజిస్ట్ సోమశేఖర్‌ను నియమించారు. దీంతో ఆసుపత్రిలో సోమవారం, గురువారం గర్భిణులకు ప్రసవాలు చేసేందుకు ఏర్పాట్లు చేశామని ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇన్‌చార్జి డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆసుపత్రిలో ఒక హెడ్‌స్టాఫ్ నర్స్, 13 మంది నర్సులు, సిబ్బంది ఉన్నట్టు పేర్కొన్నారు.

8కి చేరిన వైద్యుల సంఖ్య

ఇప్పటివరకు ఆసుపత్రిలో దంత, ఆర్థోపెడిక్, మరో నలుగురు వైద్యులతో కేవలం ఓపీ సేవలే అందేవి. తాజాగా వైద్యుల సంఖ్య 8కి పెరగడంతో మరిన్ని సేవలు అందనున్నాయి. ఆసుపత్రిలో ప్రసవాలు, శస్త్రచికిత్సలు చేయించుకున్నవారికి ఆహారాన్ని అందించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు. ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ వైద్యుడు ఉన్నా.. ఎక్స్‌రే సౌకర్యం లేకపోవడంతో డబ్బులు చెల్లించి వేరేచోట చేయించుకుంటున్నామని రోగులు వాపోతున్నారు. దంత వైద్యుడు ఉన్నా పూర్తిస్థాయిలో సేవలు అందించాల్సి ఉంది. ల్యాబ్ నిర్వాహకుడు ఒక్కరే ఉండటంతో పలు రకాల పరీక్షలు చేయడంలో ఇబ్బంది ఎదురవుతుంది. ఆసుపత్రిలో మరో ల్యాబ్ టెక్నీషియన్, సహాయకుడిని నియమించాలని కోరుతున్నారు.

మెరుగైన వైద్యం అందిస్తాం

జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు, మెరుగైన వైద్యం అందించేందుకు దృష్టి సారిస్తాం. ఇప్పటికే వైద్యులకు, సిబ్బందికి సూచనలు చేశా. ఆసుపత్రిలో సోమవారం, గురువారం ప్రసవాలు, శస్త్రచికిత్సలు చేస్తాం. ప్రస్తుతం అవసరమైన సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. - శ్రీకాంత్‌రెడ్డి, ఇన్‌చార్జి సూపరింటెండెంట్, ప్రభుత్వ ఆసుపత్రి, జమ్మికుంట

# అక్రమాల గుట్టు విప్పేదెవరు?

కాసిపేట : జాతీయ రహదారి పక్కనే అనుమతులు లేకుండా రియల్ వ్యాపారం సాగుతోంది. ఆ దారిలో ఉన్నతాధికారులు, రాజకీయ నేతలు వెళ్తుంటారు. అక్కడ అనుమతి లేని ప్లాట్లు కొంటే తిప్పలు తప్పవని వారికి తెలుసు. అయినా వీటి గురించి పట్టించుకోరు. ఇది అక్రమమని తేల్చరు. దీంతో ప్లాట్లు కొన్నవారు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ అక్రమాల గుట్టు విప్పితేనే ప్రజలకు మేలు చేకూరే అవకాశముంది. బెల్లంపల్లి నియోజకవర్గంలోని సోమగూడెం నుంచి బెల్లంపల్లి మీదుగా జాతీయ రహదారి ఏర్పాటుతో రియల్ వ్యాపారం ఊపందుకుంటోంది. కొందరు రియల్ వ్యాపారులు డీటీసీపీ అనుమతులు లేకుండానే అక్రమ వెంచర్లు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. బెల్లంపల్లి జాతీయ రహదారి పొడవునా అక్రమ వెంచర్లు రియల్ వ్యాపారులకు వరంగా మారుతోంది. అనుమతులు లేకుండా బండరాళ్లు ఏర్పాటు చేస్తూ విక్రయాలు చేపడుతున్నారు. గుంటల చొప్పున విక్రయాలు చేపడుతూ చిన్న చిన్న గుడిసెల నిర్మాణాలు చేపడుతున్నారు. గుడిసెల నిర్మాణాలు చేపడుతూ మున్సిపాలిటీ అధికారులను మక్కువ చేసుకొని ఇంటి అనుమతులు పొందుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇదంతా అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. రియల్ వ్యాపారులు అధికారులను మామూళ్ల మత్తులో ముంచుతున్నారనే ఆరోపణలున్నాయి.

కాసిపేట మండలంలోని పెద్దనపల్లి శివారులో జాతీయ రహదారికి



ఆనుకొని సకల హంగులతో 10 ఎకరాల్లో రెండేళ్ల కిందట వెంచర్ ఏర్పాటు చేశారు. రహదారి పక్కనే కావడంతో తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో అమ్మకాలు జరిగాయి. కొనుగోలు చేసిన వెంచర్‌లో ఇంటి నిర్మాణాలు చేపడుతామంటే పంచాయతీ నుంచి అనుమతులు రావడం లేదు. దీనిపై ఆరా తీయగా వెంచర్‌కు ఇప్పటి వరకు (టీపీ) ఫైనల్ పర్మినెంట్ నెంబర్ తీసుకోలేదని తెలిసింది. ఇదంతా తెలిసి ప్లాట్లు కొనుగోలు చేసిన వారు వెంచర్ ముందు ఆందోళన చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పూర్తి స్థాయిలో అనుమతులు పొందిన తర్వాతనే కొనుగోలు చేసుకోవాలని అధికారులు చెప్పారు.

**కబ్జా చేసి.. వంతెన నిర్మించి**

బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఓ ప్రైవేటు పాఠశాల జాతీయ రహదారి ముందు ద్వారం ఎదురుగా ఓ వెంచర్ ఏర్పాటు చేశారు. జాతీయ రహదారికి ఆనుకొని ఉండడం, వెనుకాల అటవీ ప్రాంతం ఉండడంతో భారీ ఎత్తున వెంచర్ ఏర్పాటు చేస్తున్నారు. వెంచర్‌కు వెళ్లేందుకు మధ్య వాగు ఉండడంతో ఆ స్థలం కబ్జా చేసి వంతెన నిర్మాణం చేపట్టారు. భారీగా వర్షాలు కురిస్తే వంతెన వద్ద నీరు నిలిచే అవకాశాలున్నాయి.

**బండరాళ్లతో హద్దులు**

బెల్లంపల్లిలోని ఓ ప్రైవేటు ఐటీఐ కళాశాల పక్కన ఎలాంటి అనుమతులు లేకుండా బండరాళ్లతో హద్దులు ఏర్పాటు చేసి బాండు పేపరు ద్వారా విక్రయాలను చేపడుతున్నారు. కొందరు ఏమో రెండు గుంటల చొప్పున తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయిస్తామని చెబుతూ విక్రయిస్తున్నారు. అనుమతులు లేకున్నా క్రయవిక్రయాలు చేపడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. దర్జాగా చిన్న చిన్న గుడిసెల నిర్మాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇదంతా ఓ ప్రజాప్రతినిధి కనుసన్నల్లో నడుస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# గజిబిజి.. గందరగోళం

నిజామాబాద్ : ప్రతి రైతు కుటుంబానికి ఆంక్షలు లేకుండా రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఆర్మూర్ సభలో పేర్కొన్నారు. 'ఆగస్టు 15 వరకు ఖాతాల్లో జమ చేస్తానని సిద్ధులగుట్టపై ఒట్టేసి చెబుతున్నానంటూ' చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. మాఫీ ఎక్కడంటూ ప్రతిపక్షాలు నిరసనకు దిగాయి. లబ్ధి చేకూరని అన్నదాతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో లక్ష మందికి పైగా రైతులు లబ్ధిచేకూరక ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి జిల్లాలో ఆహార, వాణిజ్య పంటల సాగు విస్తీర్ణం ఎక్కువ. ప్రతి కుటుంబానికి సగటున 2 నుంచి 5 ఎకరాలు ఉంటుంది. పసుపు వేస్తే ఎకరానికి కనిష్ఠంగా రూ.80 వేల వరకు బ్యాంకులు పంట రుణాలిస్తాయి. దీంతో సగానికి పైగా రైతులకు రూ.2 లక్షలకు పైగా రుణాలు పొందడం జిల్లాలో సర్వసాధారణమైంది. వీరంతా తమ పేర్లు జాబితాలో లేకపోయే సరికి గగ్గోలు పెడుతున్నారు.

**నిట్టూరుస్తూ..**

జిల్లాలో 5.20 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయి. దాదాపు 2.25 లక్షల మంది రైతులుంటారు. ఇందులో 95 శాతం మంది మంది పదెకరాల్లోపు వారే. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఇప్పటి వరకు మూడు విడతల్లో 78,748 ఖాతాలకే ప్రయోజనం చేకూరింది. వాస్తవానికి ఏటా ఒక సీజన్‌లో బ్యాంకులు సుమారుగా రూ.1400 కోట్ల పంట రుణాలిస్తాయి. ఇందులో సగం అర్హుల జాబితా ఉన్నా రూ.700 కోట్లు రావాలి. కానీ, 626.49 కోట్లు మాత్రమే మంజూరయ్యాయి. ప్రభుత్వం రైతు వారీగా కాకుండా కుటుంబం ప్రాతిపదికన గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు మాఫీ చేస్తామని ప్రకటించడంతో లక్షకు పైగా రైతులు లబ్ధి కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. కొన్నిచోట్ల సొసైటీలు, బ్యాంకుల తప్పిదాలు, ఇంకొందరికి ఆధార్, బ్యాంకు ఖాతా, చరవాణి అనుసంధానం లేకపోవడం తదితర కారణాలతో సుమారు 10 వేల మంది ప్రయోజనం పొందలేకపోయారు. వీరికి క్షేత్రస్థాయిలో ధ్రువపత్రాలు పరిశీలించి లబ్ధి చేకూరుస్తామని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. కానీ, అర్హతలున్నా తమ పేర్లు ఎందుకు మూడో జాబితాలో లేవని పెద్ద రైతులు నిట్టూరుస్తున్నారు. ఆర్మూర్, బాల్కొండ, బాన్సువాడ, నిజామాబాద్ గ్రామీణ నియోజకవర్గాల్లో ఎక్కువ మందికి రూ.2 లక్షలకు పైగానే రుణాలుండడంతో మాఫీ అమలుపై ఆందోళన చెందుతున్నారు. వీరంతా కలిపి మరో 80 వేల ఖాతాలు ఉంటాయని భావిస్తున్నారు.

**క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం**

– వాజీద్‌హుస్సేన్, జిల్లా వ్యవసాయాధికారి రుణమాఫీ జాబితా ఏఈవోలు, మండల వ్యవసాయాధికారుల వద్ద అందుబాటులో ఉంచాం. ఏదైనా కారణంతో మాఫీ వర్తించకుంటే వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని సూచించాం. ప్రభుత్వం ఇచ్చే మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరి ఖాతాల్లో డబ్బులు పడతాయి. మిగతా వారికి ప్రయోజనం చేకూర్చేందుకు సర్కారు చర్యలు తీసుకుంటుంది. ఎవరూ ఆందోళన చెందొద్దు.

# జల సిరి.. అంతటా వరి



జగిత్యాల : ఉమ్మడి జిల్లాలో ఈ వానాకాలంలోనూ వరి ప్రధాన పంటగా నిలవనుంది. ఎల్ఎండీ ఎగువ ఆయకట్టుకు ఎస్సారెస్పీ నీటి విడుదల.. ఎల్లంపల్లి ఎత్తిపోతలతో వరద కాలువ ద్వారా పంటలకు అందించే అవకాశం కలగటం, సాధారణానికి మించి వర్షపాతం నమోదు కావటంతో వరి నాట్లు జోరందుకున్నాయి. వ్యవసాయ శాఖ తాజా నివేదిక ప్రకారం కరీంనగర్ జిల్లాలో అన్నిపంటల సాగు 89.07 శాతానికి, పెద్దపల్లి 86.19, జగిత్యాల 73.27, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 88.54 శాతానికి చేరింది. ఈ నెలాఖరు వరకు వరినాట్లు వేసేందుకు, అతిస్వల్పకాలిక రకాలతో సెప్టెంబరు మొదటి వారం లోపు నాట్లు వేసేందుకు, నేరుగా వెదజల్లి వరి విత్తనాలను విత్తేందుకు అదనుండటం.. ఖాళీ నేలల్లో నువ్వు, కూరగాయలు తదితర పంటలను పండించే అవకాశం ఉండటంతో అన్ని జిల్లాల్లోనూ సాగు విస్తీర్ణం వంద శాతం దాటే అవకాశముంది. నిరుడు వానాకాలంతో పోలిస్తే కేవలం పసుపు సాగు విస్తీర్ణం మాత్రమే పెరగగా పత్తి, మక్క, సోయాబీన్, పెసర, మినుము, అలసంద తదితర తగ్గి ఈ పంటల స్థానంలో వరిసాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు.

రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో సన్న రకాల సాగువిస్తీర్ణం పెరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. సన్నగింజ రకాల్లో చీడపీడల తీవ్రత ఎక్కువగా ఉంటున్నందున మేలైన యాజమాన్యం పాటించాలని వరి శాస్త్రవేత్త డాక్టర్ బి.శ్రీనివాస్ సూచించారు.

# పంట పండినట్లే



కోనరావుపేట: మెట్ట ప్రాంతానికి తలమానికమైన నిమ్మపల్లి మూలవాగు చెరువు ఎగువన అటవీ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు మత్తడి పోస్తుంది. దీంతో చెరువు కింద ఉన్న ఆయకట్టు 2,500 ఎకరాలతోపాటు మూలవాగు పరీవాహక గ్రామాల్లో రెండు పంటలకు సాగునీటికి డోకా ఉండదు. దీంతో అన్నదాతలు పంట సాగుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.కోనరావుపేట మండలం నిమ్మపల్లిలో 1978లో రెండు గుట్టల మధ్య 19 అడుగుల సామర్థ్యంతో చెరువు నిర్మించారు. ఇందులోకి నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం చీమన్‌పల్లి, పందిమడుగు, జినగాల, తాటిపల్లి, వీర్నపల్లి మండలం వన్‌పల్లి, శాంతినగర్‌తో పాటు ఇతర అటవీ ప్రాంతాల్లో కురిసిన వర్షానికి వరద వచ్చి చేరడంతో పూర్తిస్థాయి నీటి మట్టంతో కళకళలాడుతోంది. కుడి కాలువ ద్వారా నిమ్మపల్లి, కొండాపూర్ గ్రామాల్లోని 1,500 ఎకరాలు, ఎడమ కాలువ ద్వారా జైసేవాలాల్ ఊరుతండా, జైసేవాలాల్ ఆజ్మీరాతండా, జైసేవాలాల్ భూక్యారెడ్డితండా, జైసేవాలాల్ కమ్మరిపేటతండా, వట్టిమల్ల, గొల్లపల్లి గ్రామాల్లోని వెయ్యి ఎకరాల ఆయకట్టు ఉంది. మత్తడి దూకడంతో పరీవాహక గ్రామాలైన కొండాపూర్, బావుసాయిపేట, వెంకట్రావుపేట, మామిడిపల్లి, నిజామాబాద్, కనగర్తి, వేములవాడ గ్రామీణ మండలం బొల్లారం, హన్మాజీపేట, లింగంపల్లి, మల్లారం, వేములవాడ అర్బన్ మండలం జయవరం, తిప్పాపూర్, సంకెపల్లి పరీవాహక గ్రామాలకు చెందిన ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. మూలవాగు పారడంతో భూగర్భ జలాలు పెరిగి వానాకాలం, యాసంగి సీజన్‌ల్లో రెండు పంటలకు సాగు నీటికి ఇబ్బంది ఉండదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మూలవాగులోని చెక్‌డ్యాంలు సైతం నీటితో కళకళలాడుతున్నాయి. ఫలితంగా వరి పంటకు నీటి కొరత ఉండదు.

**ఆలస్యంతో ఆందోళన చెందాం** నాకు మూలవాగు చెరువు కుడి కాలువ కింద ఎనిమిది ఎకరాలు ఉంది. మూలవాగు చెరువు పైనే ఆధారపడి వరి సాగు చేస్తుంటాను. చెరువు నిండటంతో ఆయకట్టు రైతులందరికీ పంటకు డోకా ఉండదు. మొదట వర్షాలు సరిగ్గా కురవకపోవడంతో ఈ ఏడాది చెరువు నిండుతుందో, లేదోనని రైతులంతా ఆందోళన చెందాం. ఎట్టకేలకు చెరువు నిండటంతో పంటల సాగుకు భరోసా కలిగింది. అమరం శ్రీనివాస్‌రెడ్డి, ఆయకట్టు రైతు, నిమ్మపల్లి

**అందుబాటులో భూగర్భ జలాలు**

నాకు రెండున్నర ఎకరాల సొంత భూమి ఉంది. మరో ఒకటిన్నర ఎకరాలు కౌలుకు తీసుకుని మొత్తం నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశాను. మూలవాగులోని బోరుబావి సహాయంతో పంటకు నీరు అందిస్తుంటాను. ఇటీవల కురిసిన వర్షానికి నిమ్మపల్లి చెరువు మత్తడి దూకడంతో మూలవాగు పారడం వల్ల భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో వానాకాలం, యాసంగి రెండు పంటలకు సాగు నీరు అందనున్నది. చీటి మోహన్‌రావు, రైతు, బావుసాయిపేట

# కబ్జా కోరల్లో బ్రాహ్మణకుంట

చొప్పదండి: పురపాలక సంఘం పరిధిలోని బ్రాహ్మణకుంట శిఖం భూములు కబ్జాకు గురవుతున్నాయి. అయినా అధికారులు తమకేమి పట్టదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. కుంట పరిధిలో సుమారు 25 ఎకరాల విస్తీర్ణం ఉండేది. కానీ నీళ్లు లేకపోవడంతో పక్కనే ఉన్న పట్టాదారులతోపాటు మరికొందరు ఆక్రమణలు చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

**పక్క సర్వే నంబర్‌తో విక్రయాలు**

బ్రాహ్మణకుంట శిఖం సర్వే నంబర్ 300 కాగా పక్కనే ఉన్న 301 సర్వే నంబర్‌లోని భూమి పాత పట్టాదారు పాసుపుస్తకాలతో కొంతమంది దస్తావేజులు చేసి పెట్టుకున్నారు. కొందరు పట్టాదారుల మధ్య ఉన్న విభేదాలను ఆసరాగా చేసుకుంటున్నారు. పాత దస్తావేజులతో మోఖాపై భూమి లేకున్నా కొత్త దస్తావేజులు సృష్టించి సొమ్ము చేసుకుంటున్నారు. శిఖం భూమిని చూపించి కొన్ని ప్రైవేటు ఫైనాన్స్‌లలో రుణాలు తీసుకున్నారు. లేఅవుట్లు లేకుండానే భూమి క్రయవిక్రయాలు చేపట్టారు.

**ఇంటి అనుమతులకు దరఖాస్తులు**

భూమిని కొనుగోలు చేసిన వారు ఇళ్లు నిర్మించుకునేందుకు పురపాలక సంఘం పరిధిలో దరఖాస్తు చేసుకున్నారు. కానీ శిఖం భూములకు సమీపంలో ఉండడంతో అనుమానంతో ఇళ్ల అనుమతులను తిరస్కరించారు. అయినా కొందరు ఆ భూముల్లో నిర్మాణాలు చేసుకున్నారు. పురపాలక శాఖ అధికారులు అటు వైపు చూడకపోవడంతో అనుమానాలకు తావిస్తోంది. కొంతమంది శిఖం భూములకు హద్దులు కేటాయించాలని కోరుతూ రెవెన్యూ, నీటిపారుదల అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కానీ ఇంతవరకు కేటాయించలేదు. హద్దులు లేకపోవడంతో కొందరి పట్టాభూములకు సైతం ఇంటి అనుమతులు రావడంలేదు. అధికారుల తీరుపై వారు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.



**సర్వే చేయించేలా చర్యలు**

బ్రాహ్మణకుంట శిఖం భూమిని సర్వే చేయించేలా చర్యలు తీసుకుంటాం. ఆక్రమణలు లేకుండా చూస్తాం. శిఖం భూమిలో ఎలాంటి ఇంటి నిర్మాణాలు ఉన్నా కూల్చివేయిస్తాం. తప్పుడు దస్తావేజులు సృష్టించిన వారిపైనా చట్టపరమైన చర్యలకు సిఫార్సు చేస్తాం.
పి.నవీన్‌కుమార్, తహసీల్దార్


**ఎన్‌వోసీ దరఖాస్తుతో..**

కుంట శిఖం భూమికి ఆనుకొని నిర్మించుకున్న ఇళ్లకు అనుమతులు కోరుతూ దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారుల నుంచి నిరంభ్యతర పత్రం(ఎన్‌వోసీ) దరఖాస్తుతో సమర్పిస్తే అనుమతులు ఇస్తామని వారికి చెప్పాం. ఎన్‌వోసీ వచ్చే వరకు ఎలాంటి అనుమతులు ఇవ్వబోం. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాల భూమి శిఖం భూమిలో కాకుండా బఫర్‌జోన్ బయట ఉన్నట్లు తెలిసింది.కె.నాగరాజు, పురపాలిక కమిషనర్

# ప్రతిభకు.. ఉపకార వేతనం తోడు!

పాల్వంచ : ప్రతిభావంతులైన విద్యార్థుల ఉన్నత చదువులకు అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపకార వేతనాలు మంజూరు చేస్తోంది. తాజాగా 'నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్)' పథకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. సర్కారు విద్యాలయాల్లో చదువుకునే పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఏటా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష నిర్వహిస్తున్నారు. ప్రతిభ చూపిన వారికి 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు ఏటా రూ.12 వేల చొప్పున ఉపకార వేతనం అందజేస్తారు. కానీ, కొన్ని పాఠశాలల విద్యార్థులు దరఖాస్తుకు దూరంగా ఉంటున్నారు. అవగాహన లేమి, ప్రచారలోపం, ఉపాధ్యాయుల నిరాసక్తతే దీనిక్కారణం. ఈ సారైనా పాఠశాలల నిర్వాహకులు ఎక్కువ మందితో ఆన్‌లైన్ దరఖాస్తులు చేయించాలి. సెప్టెంబరు 11 వరకు ఈ వెసులుబాటు ఉంది.

ఉభయ జిల్లాల్లో 674 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 40 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 7వ తరగతి ఉత్తీర్ణులై.. ప్రస్తుత ఏడాది 8వ తరగతి చదువుతున్న వారికి ఎన్‌ఎంఎంఎస్ ప్రతిభ పరీక్ష నిర్వహిస్తున్నారు. దీనికి ఉమ్మడి జిల్లా నుంచి ఏటా 2 వేల మంది లోపే హాజరవుతున్నారు. ప్రతిభ చూపి ఉపకార వేతనాలకు అర్హత



సాధిస్తున్న వారు వందల్లోపే ఉంటున్నారు. గత మూడేళ్లలో ఈ అవకాశం రెండు జిల్లాల నుంచి కేవలం 406 మందికే దక్కింది. ఇప్పటికైనా విద్యాశాఖ విద్యార్థుల్లో చైతన్యం కలిగించాలి. ప్రత్యేక శిక్షణ ఇచ్చేలా ఉపాధ్యాయులను ప్రోత్సహించాలి. ఈ విషయంలో కొన్ని పాఠశాలలు మాత్రం ఆదర్శంగా నిలుస్తున్నాయి.

అర్హులు వీరే.. అన్ని యాజమాన్యాల ప్రభుత్వ, ఆదర్శ పాఠశాల విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు. ఏడో తరగతి ఫలితాల్లో 55 శాతం మార్కులు సాధించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ వారు 50 శాతం మార్కులు సాధిస్తే చాలు. కుటుంబ వార్షికాదాయం రూ.3.50 లక్షల్లోపు ఉండాలి. అన్ని ధ్రువపత్రాలతో ఆన్‌లైన్ దరఖాస్తు చేయాలి. 'ఉపకార వేతన రాత పరీక్ష 180 మార్కులకు నవంబరు 24న నిర్వహిస్తారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. ఎక్కువ మంది ఎంపికయ్యేలా ఉపాధ్యాయులు కృషిచేయాలి. హెచ్.ఎం.లకు సమాచారం అందజేస్తాం' అని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరీక్షల సహాయాధికారి మాధవరావు తెలిపారు.

'ఏటా మా పాఠశాల విద్యార్థులు అధిక సంఖ్యలో ఉపకార వేతనాలకు ఎంపికవుతున్నారు. సీనియర్ల స్ఫూర్తితో, ఉపాధ్యాయుల సహకారంతో పరీక్షలకు సన్నద్ధమవుతున్నాం. సన్నద్ధానికి ప్రతిరోజు ప్రత్యేక సమయం కేటాయిస్తున్నాం'
బిల్లకంటి దేవర్షిత, కేటీపీఎస్ బాలికోన్నత పాఠశాల, పాల్వంచ

'రెగ్యులర్ చదువుతో పాటు ప్రతిభ పరీక్షకు సన్నద్ధమవుతున్నాం. ఉపాధ్యాయులు మెలకువలు నేర్పుతున్నారు. మా పాఠశాలలో ఎంతో మంది వేతనాలకు ఎంపిక అవుతున్నారు. ఈ సంవత్సరం 12 మంది బృందంగా ఏర్పడి పరీక్షలకు సన్నద్ధం అవుతున్నాం.'గుడ్ల శ్యాం కౌశిక్, మాటూరు జడ్పీ ఉన్నత పాఠశాల, మధిర మండలం

# ఆస్వాదిస్తూ.. ఆరాధిస్తూ!

కొత్తగూడెం : కొందరికి ప్రకృతి అంటే ఇష్టం. మరికొందరికి ఆధ్యాత్మిక చింతన ఉంటుంది. ఇప్పటికే రాష్ట్రంలో ప్రకృతి పర్యాటక అభివృద్ధి కోసం అటవీ, అటవీయేతర ప్రాంతాలను కలిపి 12 సర్క్యూట్లను అధికారులు గుర్తించారు. వీటిలో భద్రాద్రి జిల్లాలోని కిన్నెరసాని, ఖమ్మం జిల్లాలోని కనకగిరి అటవీ ప్రాంతాలున్నాయి. ఉభయ జిల్లాల్లో పాలేరు నుంచి పర్ణశాల వరకు ప్రధాన ఆలయాలు, చారిత్రక ప్రాంతాలను కలుపుతూ ఆధ్యాత్మిక పర్యాటకాన్ని అభివృద్ధిపరచాలనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, తుమ్మల, పొంగులేటి, తదితరులు ఇటీవల ఉభయ జిల్లాల్లో పర్యటించారు.

**కూసుమంచి గణపేశ్వరాలయం**

కూసుమంచిలోని గణపేశ్వరాలయం కాకతీయుల భక్తిభావం, కళావైభవానికి తార్కాణంగా నిలుస్తోంది. ఇక్కడి శివలింగం దక్షణ భారతదేశంలోని అతిపెద్ద శివలింగాల్లో ఒకటి. ఏటా శివరాత్రికి ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల భక్తులు ఇక్కడికి వస్తుంటారు.

**శ్రీస్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయం**

ఖమ్మంలో ఎత్తైన గుట్టపై శ్రీస్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్నాడు. భక్త ప్రహ్లాదుడిని రక్షించేందుకు నరసింహస్వామివారు ఈ ఆలయంలోని ఒక స్తంభం నుంచి బయటకు వచ్చారని కథనం.

**వైరాలో అయ్యప్పస్వామి క్షేత్రం**

వైరాలోని శ్రీఅయ్యప్పస్వామి క్షేత్రం విశిష్టత ఏంటంటే.. ఇక్కడ 45 ఫీట్ల ఎత్తు కలిగిన ఆంజనేయస్వామి విగ్రహం, రామాలయం, వెంకటేశ్వరాలయం, జ్యోతిర్లింగాలయం, సరస్వతి ఆలయంతో పాటు షిర్డీ సాయిబాబా ఆలయాలుంటాయి. ఖమ్మం మీదుగా భద్రాచలం వెళ్లే భక్తులు ఈక్షేత్రాన్ని సందర్శించవచ్చు.

**నేలకొండపల్లి మహా బౌద్ధస్తూపం**

నేలకొండపల్లి సమీపంలోని ముజ్జుగూడెంలో మహాబౌద్ధస్తూపం దేశంలోని అతిపెద్ద స్తూపాల్లో ఒకటి. బౌద్ధ భిక్షువులు నివసించిన ఆరామాలు ఇప్పటికీ ఇక్కడి నేలమాళిగల్లో భద్రంగా ఉన్నాయి. నేలకొండపల్లి బౌద్ధ మహాస్తూపాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దుతామని ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. ఇక్కడే శ్రీరాముడి మహాభక్తుడైన రామదాసు ద్యానమందిరం ఉంది.

**మహా పుణ్యక్షేత్రం భద్రాచలం**

దక్షణ అయోధ్యగా భద్రాచలం భాసిల్లుతోంది. ఏటా సుమారు 40లక్షల మంది భక్తులు భద్రాచలం రామాలయానికి వస్తున్నట్లు అంచనా. అమెరికా, శ్రీలంక, జర్మనీ, రష్యా, బ్రిటన్, తదితర దేశాలకు చెందినవారు, ప్రవాస భారతీయులు ఇక్కడికి వస్తున్నారు.

**ఖమ్మం ఖిల్లా.. జాఫర్ బావి**

శతాబ్దాల చరిత్ర కలిగిన ఖమ్మం ఖిల్లా ఎన్నో వింతలు, విశేషాలకు నిలయం. ఈ కోటకు దక్షణ భాగంలో ఉన్న బావిని స్థానికులు జాఫర్ బావిగా.. పురావస్తుశాఖ అధికారులు మెట్ల బావిగా పిలుస్తుంటారు. పర్యాటకంగా అభివృద్ధిపరచటానికి ఖిల్లాపై రూ.30కోట్లతో రోప్‌వే ఏర్పాటు చేయనున్నారు.

పర్ణశాలసీతాదేవిని రావణాసురుడు అపహరించిన ప్రాంతమిది. సీతమ్మ వాడిన నారచీరలు ఇప్పటికీ దర్శనమిస్తాయి. రామాయణంలోని ముఖ్యఘట్టా లకు వేదిక ఇది. సీతాదేవి స్నానానికి వేడినీళ్లను ఉపయోగించిన ప్రాంతం ఉష్ణ గుండాలగా ప్రసిద్ధి చెందింది.

మోతెగడ్డ దివ్యక్షేత్రం బూర్గంపాడు మండలం మోతెగడ్డ దివ్యక్షేత్రం పవిత్ర స్థలంగా వెలుగొందుతోంది. వరదల సమయంలో చుట్టూ నీరుచేరి దీవిలా కనిపిస్తుంది. భద్రాచలం నుంచి పర్ణశాల వరకు బోటు ఏర్పాటుచేస్తే మార్గమధ్యలో ఈ దీవికి చేరుకోవచ్చు.




## దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచండి: సుప్రీం ధర్మాసనం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడకం వివాదంపై సుప్రీంకోర్టు ఘాటుగా స్పందించింది. దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచాలని హితవుపలికింది. లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించారనడానికి ఆధారాలు ఏమైనా ఉన్నాయా అని ప్రభుత్వం తరపున న్యాయవాది ముకుల్ రోహత్గీని జస్టిస్ బి ఆర్ గవాయ్, జస్టిస్ కేవీ వి బాలకృష్ణన్ ధర్మాసనం ప్రశ్నించింది. కల్తీ నెయ్యిని లడ్డూలో వాడారో లేదో పూర్తిగా తెలియకుండా ముఖ్యమంత్రి ఎలా ప్రకటన చేస్తారని సుప్రీంకోర్ట్ నిలదీసింది. ఈ అంశంపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) నియమించిన అనంతరం కల్తీ నెయ్యిపై మీడియా ముందు ప్రకటన చేయడంపై ధర్మాసనం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇటువంటి ప్రస్తుత పరిస్థితుల్లో కొత్తగా నియమించిన సిట్ సరిగ్గా విచారణ జరపగలదా? అన్న సందేహాలు ఉన్నాయని న్యాయస్థానం పేర్కొంది. స్వామి వారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యిని వినియోగించినట్లు ఎలా తెలిసిందంటూ సుప్రీంకోర్ట్ సందేహం వ్యక్తం చేసింది. అలాగే స్వామి వారి ప్రసాదం లడ్డూని పరీక్షల కోసం ల్యాబ్‌కి ఎప్పుడు పంపారని ముకుల్ రోహత్గిని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం విచారణ జరిపితే బావుంటుందని ధర్మాసనం అభిప్రాయపడింది. అనంతరం ఈ కేసు విచారణను జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ బాలకృష్ణన్ ధర్మాసనం గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు తిరుమల లడ్డూ వివాదంపై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. తిరుమల స్వామి వారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగించినట్లు ఆరోపణలు నేపథ్యంలో ఈ అంశంలో నిజం నిగ్గూ తేల్చాలంటూ బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి, వైసీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి వేర్వేరుగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. వీటిపై సుప్రీంకోర్టులో ఇవాళ (సోమవారం) విచారణ జరిపింది. గత ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగించినట్లు ఎన్‌డీడీబీ నివేదిక స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘోర అపచారం జరిగిన నేపథ్యంలో శ్రీవారి ఆలయంలో శాంతి హోమాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించింది.

అలాగే సంప్రోక్షణ కార్యక్రమాన్ని సైతం చేపట్టింది. అందులో భాగంగా ఆనంద నిలయంతో పాటు తిరుమల మాఢవీధుల్లో సైతం సంప్రోక్షణ నిర్వహించింది. మరోవైపు తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారాన్ని ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ జరపాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది. గుంటూరు ఐజీ సర్వ శ్రేష్టి త్రిపాఠి నేతృత్వంలో సిట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో శనివారం సిట్ బృందం తిరుమల చేరుకుని.. తన దర్యాప్తును ప్రారంభించింది.




అమరావతి: హిందూ ధర్మం ప్రమాదంలో ఉందనడానికి లడ్డూ అంశం క్లైమాక్స్ లాంటిదని జనసేన జాతీయ కార్యదర్శి నాగబాబు అన్నారు. సనాతన ధర్మం బతకడం నేర్పించిందని, దానికి అన్యాయం జరుగుతోందనే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడారని తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. " పవన్ కల్యాణ్ మాటలను పూర్తిగా సమర్థిస్తున్నా. హిందూ దేవాలయాలు, ధార్మిక మండళ్లు హిందువులే నిర్వహించాలి. ప్రభుత్వాల నిర్ణయాలు కోట్లాది మంది హిందువులపై ప్రభావం చూపుతున్నాయనేదే పవన్ కల్యాణ్ బాధ.

అన్ని మతాలతో కలిసి ఉండే వ్యక్తి పవన్ కల్యాణ్. హిందూ ధర్మ రక్షణ మండలి ఏర్పాటు చేయాల్సిన అవసరముంది." అని అన్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని, దోషులెవరున్నా బయటకు వస్తారని తెలిపారు. వైకాపా నాయకులు చేస్తున్న విమర్శలకు సమాధానాలు చెప్పాల్సిన అవసరం లేదన్నారు.

## మేము సైతం అంటున్న ప్రముఖులు.. వరద బాధితులకు విరాళాల వెల్లువ



అమరావతి, సెప్టెంబర్ 30: వరద బాధితుల కోసం విరాళాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. బాధితులను ఆదుకునేందుకు మరికొంతమంది ప్రముఖులు ముందుకొచ్చారు. సోమవారం విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను కలిసి ప్రముఖులు విరాళాలు అందజేశారు. విజయవాడకు చెందిన ఇండిపెండెంట్ స్కూల్స్ మేనేజ్ మెంట్స్ అసోసియేషన్ (ఐసీఎమ్ఏ) ప్రతినిధులు రూ.50 లక్షల విరాళం అందజేశారు. అనంతపురానికి చెందిన కేవీఎమ్ షకీల్ షఫీ నేతృత్వంలో ఏపీ వక్ఫ్ ఇన్ స్టిట్యూషన్స్, ముతవల్లీస్ అండ్ మేనేజింగ్ కమిటీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.7,86,000 విరాళంగా అందజేశారు. తెనాలి పిడపర్తిపాలెంకు చెందిన అరుణోదయ మహిళా గ్రూప్ ఆధ్వర్యంలో రూ.1,21,000 విరాళం అందించారు. అలాగే మచిలీపట్నంకు చెందిన ఎమ్.ధనలక్ష్మి రూ.లక్ష విరాళం, అనంతపురానికి చెందిన గుండిగ నాగరాజు రూ.10వేలు విరాళం ఇచ్చారు. కష్టాల్లో ఉన్న వారికి తమవంతు సాయం అందించిన దాతలకు మంత్రి నారా లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు. కొద్దిరోజుల క్రితం గుంటూరుకు చెందిన దామచర్ల శ్రీనివాసరావు ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.6,01,116 , అమలాపురానికి చెందిన బోనం వెంకట చలమయ్య ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ బోనం కనకయ్య రూ.5 లక్షలు, నంద్యాలకు చెందిన ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కాలేజీ ఎండీ ఎస్.దినేష్ రెడ్డి, కాలేజీ డీన్ బి.సూర్యప్రకాష్ రెడ్డి రూ.4 లక్షలు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష నేతృత్వంలో ప్రజలు, వివిధ సంస్థల నుంచి సేకరించిన విరాళం రూ.2,95,000, నవ్యాంధ్రప్రదేశ్ ప్లాస్టిక్ మాన్యుఫ్యాక్చరింగ్ అసోసియేషన్ ప్రతినిధి జయకుమార్ రూ.2,50,000, మదనపల్లెకు చెందిన గోల్డెన్ వ్యాలీ ఇంజనీరింగ్ కాలేజ్ కరస్పాండెంట్ ఎన్.వి రమణారెడ్డి, కట్టా దొరస్వామి నాయుడు రూ.2 లక్షలు, అనంతపురానికి చెందిన వి.సురేష్ నాయుడు లక్ష రూపాయలు, బీజేపీ మజ్దూర్ విభాగం నాయకుడు నాగేశ్వరరావు రూ.10వేలు అందజేశారు. కాగా కష్టాల్లో ఉన్నవారిని ఆదుకునేందుకు తమవంతు సాయం అందించిన వారికి మంత్రి నారా లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు. కాగా.. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో విజయవాడ వాసుల జనజీవనం అస్తవ్యస్తంగా మారిపోయింది. కొద్దిరోజుల పాటు అనేక కాలనీలు జలదిగ్బంధంలోనే ఉండిపోయిన పరిస్థితి. వరద బీభత్సం నుంచి ఇప్పుడిప్పుడే విజయవాడ వాసులు కాస్త కోలుకుంటున్నారు. మరోవైపు వరద బాధితులకు సహాయ సహకారాల కోసం సీఎం చంద్రబాబుతో పాటు ప్రభుత్వ యంత్రాంగం కదలి వచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు దాదాపు పది రోజులు విజయవాడలోనే ఉంటూ వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించి వారికి సహాయ సహకారాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంత్రులు, అధికారులు వరద ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని ఆదేశించారు కూడా. అలాగే ప్రభుత్వ సహాయమే కాకుండా వరద బాధితులకు ఆర్థిక సహాయం అందించాలంటూ సీఎం చంద్రబాబు ఇచ్చిన పిలుపుమేరకు అనేక మంది దాతలు ముందుకొచ్చారు. రాజకీయ, సినీ ప్రముఖులు, ప్రముఖ వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు ఇలా అనేక మంది ముందుకు వచ్చి విరాళాలు ఇచ్చారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులు కూడా తమ ఒకరోజు జీతాన్ని విరాళంగా సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేశారు. వివిధ జిల్లాల నుంచి సామన్యులు కూడా తమవంతు సాయం అందజేశారు. ఇప్పటికీ విరాళాల వెల్లవ కొనసాగుతూనే ఉంది.

## అందరికీ వరదసాయం అందాకే ఆ కార్యక్రమం..




అమరావతి: వరద సాయంలో పగలు, రాత్రి కష్టపడి పనిచేసిన అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంధ సంస్థలు, పారిశుధ్య కార్మికులు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపే కార్యక్రమం వాయిదా పడింది. వరద సాయం కార్యక్రమంలో భాగస్వాములు అయిన వారితో సోమవారం విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో సమావేశం అవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భావించారు. అయితే బాధితులందరికీ పూర్తిస్థాయిలో వరదసాయం అందాకే ఈ కార్యక్రమం నిర్వహించాలని సీఎం నిర్ణయించారు. దీంతో ఈరోజు విజయవాడ కలెక్టరేట్లో నిర్వహించ తలపెట్టిన కార్యక్రమం వాయిదా పడింది. భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన ప్రజల అకౌంట్లకు పరిహారం సాయం ప్రభుత్వం అందజేస్తోంది. ఆస్తి, పంట నష్టం కింద 4 లక్షల మందికి రూ. 602 కోట్లు పరిహారం చెల్లింపునకు ప్రభుత్వ నిర్ణయించింది. ఈ మేరకు నిధులు విడుదల చేసింది. ఇందులో భాగంగా ప్రజల అకౌంట్లలో ఇప్పటివరకు రూ. 569 కోట్లు జమ అయ్యాయి. కొంతమంది బ్యాంక్ అకౌంట్‌లు యాక్టివ్‌గా లేకపోవడం వంటి కారణాలతో పరిహారం పెండింగ్‌లో ఉన్నవారికి ఈరోజు చెల్లింపులు పూర్తి కానున్నాయి.

**సీఎం చంద్రబాబు పత్తికొండ పర్యటన :** కాగా సీఎం చంద్రబాబు మంగళవారం కర్నూలు జిల్లా, పత్తికొండలో పర్యటించనున్నారు. పుచ్చకాయల మాడ గ్రామంలో సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ బిందు మాధవ్, జేసీ నవ్యలు పరిశీలించారు. ఆదివారం సాయంత్రం పుచ్చకాయలమడ చేరుకున్న వారు ముందుగా గ్రామంలోని హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను పరిశీలించారు. వాహనాల పార్కింగ్, పెన్షింగ్ వంటి అంశాలపై ఆయా శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. హెలిప్యాడ్ నుంచి ముఖ్యమంత్రి గ్రామంలోకి వెళ్లే మార్గంలో ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం ముఖ్యమంత్రి నుంచి పింఛన్లు అందుకునే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడతారు. ముఖ్యమంత్రి పింఛన్‌దారుల ఇంటికి వెళ్లి పింఛన్ అందిస్తారని, ఆయనకు ఇబ్బంది కలగకుండా ఆయా ఇళ్లలో అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆశించారు. అనంతరం గ్రామాభివృద్ధికి సంబంధించి ముఖ్యమంత్రి ప్రారంభించనున్న పైలాన్‌ను పరిశీలించారు. ముఖ్యమంత్రి దర్శించుకునే కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయంతోపాటు గ్రామ సభ నిర్వహించే సభాస్థలి ప్రాంతానికి చేరుకొని అధికారులకు పలు సూచనలు చేశారు. పుచ్చకాయలమడ అభివృద్ధికి రూ.2.8 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. గ్రామంలోని వివిధ అభివృద్ధి పనులకు వీటిని వినియోగిస్తామని చెప్పారు. కాగా ముఖ్యమంత్రి అక్టోబరు 1న ఉదయం (మంగళవారం) 11.40 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12.30 గంటలకు కర్నూలు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అనంతరం పత్తికొండ మండలం పుచ్చకాయలమడ గ్రామంలో నిర్వహించే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. కొన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపనకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారు. తర్వాత స్వచ్ఛతా హీ సేవా ప్రతిజ్ఞ చేయించి ప్రజా వేదిక కార్యక్రమంలో గ్రామస్థులతో మాట్లాడతారు. అనంతరం తిరిగి విజయవాడకు బయలుదేరి వెళతారు.

## పులివెందుల నియోజక వర్గంలో దారుణం..




కడప జిల్లా: పులివెందుల నియోజకవర్గంలో దారుణం చోటు చేసుకుంది. ఓ వీఆర్ఏ ఇంటిని దుండగులు డిటోనేటర్లతో పేల్చివేశారు. వేముల మండలం, కొత్తపల్లి గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో వీఆర్ఏ నర్సింహులు మృతి చెందగా ఆయన భార్య తీవ్రంగా గాయపడ్డారు. దంపతులు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో దుండగులు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. పేలుడు శబ్ధంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు. సోమవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన ప్రదేశానికి చేరుకుని విచారిస్తున్నారు. కొత్తపల్లి గ్రామం ఫ్యాక్షన్ విలేజి కావడంతో నర్సింహులుకు పాత గొడవలు ఉన్నాయా, ప్రత్యర్థులు ఉన్నారా.. అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు అక్రమ సంబంధం నేపథ్యంలో ఈ ఘటన జరిగిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే నర్సింహులుకు ఫ్యాక్షన్ బ్యాక్ గ్రౌండ్ ఏమీ లేదని గ్రామస్తులు చెబుతున్నారు. అక్రమ సంబంధం నేపథ్యంలో ఈ ఘటన జరిగిందని పోలీసులు కూడా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఊరిలోవారు కాదని బయట నుంచి వచ్చిన దుండగులు ఈ దారుణానికి పాల్పడి ఉంటారని పోలీసులు చెబుతున్నారు. ఆ కోణంలో కూడా విచారణ చేస్తున్నారు. కాగా ఇంట్లో వీఆర్ఏ నర్సింహులు నిద్రిస్తున్న సమయంలో అతని మంచం దగ్గర డిటోనేటర్లుపేల్చి ప్రత్యర్థులు హతమార్చారు. పేలుడు ఘటనలో ఇల్లు ధ్వంసం అయింది. వీఆర్ఏ నరసింహులు అక్కడ కక్కడే మృతి చెందారు. పేలుడు సమయంలో అదే ఇంట్లో వేరేగదిలో నిద్రిస్తున్న మృతుని భార్య సుబ్బలక్షుమ్మకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఆమెను కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. హతుడు భార్య తరుపున వ్యక్తులే ఈ ఘటనకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నర్సింహులు హత్యకు భార్య అక్రమ సంబంధం కారణమని కూడా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచా రిస్తున్నారు.

## జగన్‌ది మానవత్వం కాదు.. కృరత్వం. .. మంత్రి అనగాని వ్యంగ్యాస్త్రాలు



అమరావతి: దేశాన్ని, మతాన్ని కించపరిచేలా మాజీ సీఎం, వైఎస్సార్సీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధాకరమని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో 100రోజుల పాలన- అభివృద్ధి సంక్షేమాలు పేరిట ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఎమ్మెల్సీ అశోక్ బాబుతో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను మంత్రి అనగాని స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని మాట్లాడుతూ... భక్తుల మనోభావాలు గౌరవించి జగన్‌ను డిక్లరేషన్ ఇవ్వమంటే దేశం, హిందూయిజం మీద దాడి చేస్తున్నారని మండిపడ్డారు. తన మతం మానవత్వం అని చెప్పుకుంటున్న జగన్‌ది కృరత్వమని విమర్శించారు. జగన్‌ది మానవత్వం కాదు.. కృరత్వమని ఎద్దేవా చేశారు. కల్తీ లడ్డు వ్యవహారంలో జరిగిన తప్పు ఒప్పుకోలేక, క్షమాపణ చెప్పలేక జగన్ వంకర మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. త్వరలోనే రెవెన్యూ సదస్సులు ప్రారంభిస్తామని తెలిపారు. రీసర్వే సమస్యల పరిష్కారంపై మళ్లీ దృష్టి సారిస్తున్నామని చెప్పారు. రెవెన్యూ సిబ్బంది వరద నష్టంలో నిమగ్నమైనందున రీసర్వే సమస్యల పరిష్కారానికి కొంత గ్యాప్ వచ్చిందని అన్నారు. కూటమి ప్రభుత్వం 100రోజుల పాలనపై సర్వత్రా చర్చ జరుగుతోందని తెలిపారు. కేవలం 100రోజుల్లో ప్రజలకు మెరుగైన సంక్షేమం ఇచ్చిన ప్రభుత్వం తమది అని ప్రజలు గుర్తించారని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.

## చైతన్యం విషయంలో భారత్ ముందజలో ఉంది



గుంటూరు జిల్లా: భారతతత్వ శాస్త్రంలో లౌకిక, అలౌకిక అంశాలు చాలా ఉన్నాయని భారత ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు వ్యాఖ్యానించారు. గుణం లేని వారు కులం పేరు, మానవత్వం లేని వారు మతం పేరు, పస లేని వారు ప్రాంతం పేరు ఎత్తుతారనే గుర్రం జాషువా మాటలు ఈ సందర్భంగా ప్రస్తావించాలని అన్నారు. చైతన్యం విషయంలో భారత ఉప ఖండం ప్రపంచంలోని చాలా దేశాల కంటే ముందంజలో ఉందని తెలిపారు. కాస్మాలజీ, మెటా ఫిజిక్స్ వంటి శాస్త్రాలు కూడా మన తత్వాల్లో ఉన్నాయని చెప్పారు. ఆచార్య నాగార్జునుడు, ఆది శంకరాచార్యులు తాత్వికతను ప్రముఖంగా చెప్పారని గుర్తుచేశారు. వేమన శతకం చదివితే అద్భుతమైన ప్రాపంచిక చింతన అలవడుతుందని తెలిపారు. ఇటీవలి కాలంలో జిడ్డు కృష్ణమూర్తి, సర్వేపల్లి రాధాకృష్ణన్ తర్వాత భారత తత్వశాస్త్రాన్ని విశ్వవ్యాప్తం చేసిన వారు కొత్త సచ్చిదానంద మూర్తి గురించి వింటున్నామని అన్నారు. ఈ ముగ్గురు తెలుగువారు కావటం మన అదృష్టమని చెప్పారు. విజ్ఞానం సముపార్జించాలి.. ఇతరులతో పంచుకోవాలి.. అందులోనే ఆనందం ఉంటుందని చెప్పారు. నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లు మన తత్వశాస్త్రం పరిష్కారాలను చూపించగలదని అన్నారు. ఈ విషయాన్ని గుర్తించి అన్ని స్థాయిల్లో భారతీయ తత్వచింతనను అలవాటు చేసుకోవాలని సూచించారు. మన ఉపనిషత్తులలో ఎన్నో మంచి అంశాలు ఉన్నాయని వివరించారు. స్వామి వివేకానంద అమెరికాలో చేసిన ప్రసంగంలోని అంశాలు ఉపనిషత్తుల్లో నుంచి తీసుకున్నవేనని వెంకయ్యానాయుడు పేర్కొన్నారు.

## రాజమహేంద్రవరం ప్రజల రుణం తీర్చుకోలేనిది: నారా భువనేశ్వరి



రాజమహేంద్రవరం: రాజమహేంద్రవరం ప్రజలు తనకు కుటుంబసభ్యులతో సమానమని.. వారి రుణం తీర్చుకోలేనిదని సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. నగరంలోని ప్రకాశ్‌నగర్‌లో ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్లడ్ బ్యాంక్‌ను ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. గోరంట్ల శాంతారావు ఫౌండేషన్ సౌజన్యంతో బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చంద్రబాబు అరెస్ట్ అయ్యాక ఇక్కడే ఉన్నానని.. ఆ 53 రోజులు మరువలేనన్నారు. తనతో పాటు కుటుంబసభ్యులకు ఎంతో ధైర్యమిచ్చి ముందుకు నడిపించారని చెప్పారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను భువనేశ్వరి వివరించారు.

## పట్టభద్రుల ఓటర్ల నమోదుకు ఈసీ నోటిఫికేషన్



అమరావతి: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజవర్గ పరిధిలో ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం (ఈసీ) నోటిఫికేషన్ జారీ చేసింది. అక్టోబరు 1 నుంచి నవంబరు 6 వరకు ఈ జిల్లాల పరిధిలో పట్టభద్రులైన ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఫాం-18 ద్వారా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ఈసీ సూచించింది. నవంబర్ 23న ఓటర్ల జాబితా ముసాయిదాను ప్రకటించనున్నారు. డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలను స్వీకరించి.. అదే నెల 30న తుది జాబితాను వెల్లడించనున్నారు. ఇప్పటికే ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గాల్లో ఓటర్ల నమోదుకే ఈసీ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే.

## వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టండి.. సాగదీస్తే లాయర్లకే లాభం: సీజేఐ కీలక వ్యాఖ్యలు

ఢిల్లీ: వైవాహిక బంధంలో వివాదాలకు సంబంధించిన ఓ కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారంలో సుదీర్ఘ న్యాయపోరాటం వల్ల అది న్యాయవాదులకే ప్రయోజనంగా మారుతుందని అన్నారు. అందువల్ల పరస్పర సమ్మతితో విడాకులకు అంగీకరించాలని ఆ దంపతులకు సూచించారు. తమ జంట మధ్య వివాదానికి సంబంధించిన కేసును మరో కోర్టుకు బదిలీ చేయాలంటూ ఓ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈసందర్భంగా సదరు మహిళ విద్యార్హతలను చీఫ్ జస్టిస్ అడిగారు. తాను ఎంటెక్ పూర్తిచేసి, అమెరికా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందినట్లు ఆమె సమాధానమిచ్చారు. అయితే, ప్రస్తుతానికి తానేమీ ఉద్యోగం చేయట్లేదని పేర్కొన్నారు. దీనికి సీజేఐ జస్టిస్ డి.వై చంద్రచూడ్ స్పందిస్తూ.. "మీరు విద్యావంతులు. ముందు మంచి ఉద్యోగం సంపాదించండి.

ఈ కేసులో మీరు 10 ఏళ్లయినా న్యాయపోరాటం చేయగలరేమో..! కానీ దానివల్ల కేవలం న్యాయవాదులకే ప్రయోజనం కలుగుతుంది. మీరెందుకు పరస్పర సమ్మతితో విడాకులు తీసుకునేందుకు అంగీకరించకూడదు? మీరు అందుకు అంగీకరిస్తే కేసును మూసేస్తాం. మీరు వైవాహిక బంధాన్ని తిరిగి కొనసాగించే పరిస్థితుల్లో లేరని స్పష్టమవుతోంది. మీరు నిరక్షరాస్యులైతే కేసు వేరేగా ఉండొచ్చు. కానీ మీరు చదువుకున్నవారు.. ఉద్యోగం సంపాదించగలరు" అని ఆ మహిళకు సూచించారు.

# ఒక్క క్షణం మతి పోగొట్టిన నటవారసురాలు

సారా అలీఖాన్ – అందం.. ప్రతిభ.. అణకువ.. ఇలా ఏ కోణంలో చూసినా ది బెస్ట్ ఇన్ బాలీవుడ్. మామ్ అమృతను పోలి ఉండే సారా, పాపా సైఫ్ సలహాతో చిత్రసీమలో ఒక్కో మెట్టు ఎక్కుతూ స్టార్ డమ్ అందుకునే దిశగా సాగుతోంది. ఇప్పటికే తాను నటించిన సినిమాలతో నటిగా పేరు తెచ్చుకుంది. మరోవైపు ఫ్యాషన్ అండ్ ట్రెండ్స్ లోను ట్రెండ్ సెట్టర్ గా మారుతోంది. నిరంతరం సామాజిక మాధ్యమాల్లో సారా అలీఖాన్ ఫోటోషూట్లు వైరల్ అవుతూనే ఉన్నాయి. తాజాగా అద్భుతమైన అబుజానీ సందీప్ కోస్లా డిజైనర్ గౌనులో సారా కనిపించింది. గోల్డెన్ గౌను కాంబినేషన్ యాక్సెసరీస్‌లో రెట్రో గ్లామర్‌ను వెదజల్లుతూ కనిపించింది సారా. వెండి ఒత్తులతో మిరుమిట్లు గొలిపేలా అందంగా అలంకరించిన ఆకర్షణీయమైన గోల్డెన్ గౌనులో అద్భుతమైన రూపంతో సారా అభిమానులను థ్రిల్ చేసింది. సారా ధగధగా మెరిసే వెండి డిజైన్లతో అలంకరించిన స్లీవ్‌లెస్ గోల్డెన్ గౌనులో ఓపెన్ హిప్ ..థై స్లిట్ లుక్ తో గుబులు రేపింది. బాహ్య అంతరిక్షంలో నాట్ అవుట్ ఆఫ్ ప్లేస్ అని దీనికి క్యాప్షన్ ఇచ్చింది. సారా ఈ కొత్త లుక్ లో హెడ్ టర్నర్ గా నిలిచింది. ఇన్‌స్టాగ్రామ్‌లో 45.8 మిలియన్ల మంది అనుచరులకు ఇది స్పెషల్ ట్రీట్ గా మారింది.



సైఫ్ అలీ ఖాన్ – అమృతా సింగ్ ల కుమార్తె సారా అలీఖాన్. కానీ ఆమె తల్లిదండ్రులు 2004లో విడిపోయారు. తనకు ఇబ్రహీం అనే తమ్ముడు ఉన్నాడు. సారా 2018లో దివంగత నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్‌తో కలిసి అభిషేక్ కపూర్ రొమాంటిక్ ఇంటర్–ఫెయిత్ లవ్ స్టోరీ కేదార్‌నాథ్‌లో నటించింది. ఆ తర్వాత రోహిత్ శెట్టి దర్శకత్వం వహించిన యాక్షన్ చిత్రం సింబాలో నటించింది. రోహిత్ శెట్టి పిక్చర్స్, రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్, ధర్మ ప్రొడక్షన్స్ ఈ సినిమాని నిర్మించాయి. ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్, సోనూ సూద్ కీలక పాత్రలు పోషించగా, అజయ్ దేవగణ్ తన సింగం పాత్రతో అతిధిగా కనిపిస్తాడు. లవ్ ఆజ్ కల్, కూలీ నంబర్ 1, అత్రంగి రే, గ్యాస్‌లైట్, జరా హట్కే జరా బచ్కే, మర్డర్ ముబారక్ వంటి సినిమాల్లో కూడా భాగమైంది. 1942లో భారతదేశ స్వాతంత్ర్య పోరాటం చుట్టూ తిరిగే చారిత్రాత్మక జీవితచరిత్ర చిత్రం ఏ వతన్ మేరే వతన్‌లో సారా చివరిసారిగా ఉషా మెహతాగా కనిపించింది. దీనిని కన్నన్ అయ్యర్ రచించి దర్శకత్వం వహించారు. కరణ్ జోహార్ నిర్మించారు, ఇందులో ఇమ్రాన్ హష్మి, అలెక్స్ ఓ నెల్ కూడా నటించారు. ఈ చిత్రం అమెజాన్ ప్రైమ్ వీడియోలో ప్రసారం అవుతోంది. సారా నటించిన మెట్రో... ఇన్ డినో, స్కై ఫోర్స్, ఈగిల్ విడుదలకు రావాల్సి ఉంది.

# ఐఫాలో రాశీ ఇలా ఎమోషన్ అయిందేమిటీ?

ఐఫా– 2024 వేడుకలు రెండు రోజుల పాటు అంగరంగ వైభవంగా సాగాయి. ఈ ఉత్సవాల్లో స్టారాధి స్టార్లు మెరిసారు. అందులో రాశీ ఖన్నా ఒకరు. రాశీ ప్రస్తుతం తెలుగు, తమిళం, హిందీ చిత్రాలలో నటిస్తున్నారు. ఐఫా ఉత్సవాల సమయంలో జాతీయ మీడియాతో మాట్లాడుతూ రాశీ చెప్పిన కొన్ని విషయాలు ఆద్యంతం అందినీ ఆలోచింపజేసాయి. రాశీ ఏం చెప్పారంటే? లిఎవరైనా నటి మంచిగా ఉండటం ఒక్కటే సరిపోదు... కష్టపడి పనిచేయడం విజయానికి కీలకం. ఏ రంగంలో ఉన్నా, నిచ్చెనను అధిరోహించడానికి మీరు మీ బెస్ట్ అందించాలి. ఏ మెట్టు ఎక్కాలి? ఎన్ని మెట్లు ఎక్కాలి? అనే ఒత్తిడికి లోనుకాకుండా కష్టపడి క్రమశిక్షణతో మెలగాలి. కళ అనేది పోటీ కాదు.. ఇది ఒక సహకారం. నేను ఎల్లప్పుడూ చేయగలిగినంత



ఉత్తమంగా చేయడంపై దృష్టి సారిస్తాను.. ఇతరులు కూడా అలాగే ఉంటారు. మీరు మీ బెస్ట్ ఇవ్వడంపై దృష్టి కేంద్రీకరించినప్పుడు.. మీరు ఎల్లప్పుడూ ఇతరులతో కలిసి మెరుస్తూ ఉంటారు. ఏదైనా పరిశ్రమలో ఎదుగుదలను మీ ఎంపికలు నిర్ణయిస్తాయి. ఒకరి పరిధి , బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించడానికి అవకాశం లేని పాత్రలలో నటించడం సరైంది కాదు. అయితే ఈరోజు తమ ఎంపికలలో ధైర్యంగా ఉండే .. భిన్నమైన పాత్రలు పోషించడానికి వేచి ఉన్న మహిళా నటులకు చాలా మంచి అవకాశాలు ఉన్నాయి..అని రాశీ తెలిపారు. రాశీ తదుపరి విక్రాంత్ మాస్సేతో కలిసి ది సబర్మతి రిపోర్ట్‌లో కనిపించనుంది. నవంబర్ 15న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఇది ఇన్ఫోటైన్ మెంట్... నిజంగా ఏమి జరిగిందనే వాస్తవ సంఘటనలను చూపిస్తున్నారు. షాహిద్ కపూర్, విజయ్ సేతుపతితో కలిసి ఫర్జీ రెండవ సీజన్‌లోను రాశి నటిస్తోంది.




# భారత్ లో ఆ సినిమా బహిష్కరణ!



పాకిస్తాన్ మూవీ దిలెజెండ్ ఆఫ్ హౌలా జాట్ అక్కడ మంచి విజయం సాధించింది. ఈ సినిమా అక్కడ ప్రేక్షకులు ఇండియన్ బాహుబలిలా పేర్కొంటున్నారు. అసలే పాకిస్తాన్ ఇండస్ట్రీ వెనుకబడి ఉంది. అలాంటి సమయంలో ఇలాంటి సక్సస్ ఇండస్ట్రీకి రావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. అయితే ఇప్పుడా పాకిస్తాన్ మూవీ భారత్ లో విడుదలకు అనుమతి లభించడం లేదు. 2016 నుంచి భారత్ సినిమాల్ని పాకిస్తాన్ బ్యాన్ చేసిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో ఇప్పుడు పాకిస్తాన్ సినిమాకి భారత ప్రభుత్వం అనుమతివ్వడం లేదని తెలుస్తోంది. ఈ సినిమా కేవలం పంజాబ్ లో మాత్రమే అందుబాటులో ఉంటుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. కొన్ని రోజుల క్రితం మహారాష్ట్ర నవ నిర్మాణ సేన అధినేత రాజ్ థాక్రే ఈ సినిమా విడుదల చేస్తే బాగుండదని హెచ్చరించారు. మహారాష్ట్రలోనూ రిలీజ్ అవ్వడానికి వీల్లేదని ..ఆ పార్టీ అనుతించదని ట్వీట్ చేసారు. భారత్ లోనే కాదు ఏ దేశం కూడా పాకిస్తాన్ సినిమాలు అనుమతి ఇవ్వకూడదని కోరారు. అనంద్ దూబే కూడా ఈ సినిమాపై అగ్రహం వ్యక్తం చేసారు. దీంతో పాకిస్తాన్ బాహుబలికి ఇండియాలో నో ఛాన్స్ అన్నట్లే కనిపిస్తుంది. అయితే పాకిస్తాన్ నటులు పలు సందర్భాల్లో కళాకారుల్ని రాజకీయాల్లోకి లాగొద్దని కోరారు. రాజకీయాలకు అతీతంగా తమని రెండు దేశాలుస్వాగతించాలని కోరారు. కానీ అది సాధ్యపడలేదు.

పాకిస్తాన్ చర్యలు అంతకంతకు రెచ్చగొట్టే రీతున ఉన్నాయి తప్ప స్వాగతించే పరిస్థితుల్లో లేవని నాయకులు అభిప్రాయ పడుతున్నారు. పాకిస్తాన్ లో జరిగే ట్రోఫీకి భారత్ టీమ్ హాజరవుతుందా? లేదా? అన్న దానిపై కూడా ఇంకా స్పష్టత లేదు.

# 'గేమ్ ఛేంజర్' పై ఇంపాక్ట్ అప్పుడే పడుతోందా?




'ఆర్ ఆర్ ఆర్' తర్వాత రిలీజ్ అయిన తారక్ తొలి సినిమా %–%దేవర%–% మొదటి భాగం దాదాపు గట్టేక్కిసినట్లే. సినిమాకి భారీ ఓపెనింగ్స్ రావడం..తొలి రోజే 172 కోట్లు రావడంతో తిరుగులేని వసూళ్లగా మారాయి. స్టిల్ సినిమా బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. రివ్యూలు నెగిటివ్ గా వచ్చినా? వాటితో పనిలేకుండా జనాదరణకు నోచుకుంటుంది. ఈ సినిమా తర్వాత నెక్ట్స్ రేసులో ఉంది పుష్ప–2 ఈ సినిమా భారీ అంచనాల మధ్య డిసెంబర్ లో రిలీజ్ అవుతుంది.

తొలి భాగం సక్సెస్ నేపథ్యంలో భారీ హైప్ తో ప్రేక్షకుల ముందుకొస్తుంది. ఈ సినిమా తొలి రోజే ఆర్ ఆర్ ఆర్ దేవన్ వసూళ్లు క్రాస్ చేస్తుందనే అంచనాలు తెరపైకి వస్తున్నాయి. 200 కోట్ల వసూళ్లను సునాయాసంగా దాటేస్తుందంటున్నారు. ఈ సినిమాకు ఉన్న అన్ని వైపులా పాజిటివ్ గానే ఉంది. ఏదైనా చిన్న నెగిటివ్ ఉంది అంటే? అది పొలిటికల్ గా వచ్చిన వైరం తప్ప మరేం లేదు. అప్పటికీ ఆ పరిస్థితి కూడా సర్దుకుంటుందనే అంచనాలున్నాయి. అయితే మెగాపవ్ స్టార్ రామ్ చరణ్ నటిస్తోన్న గేమ్ ఛేంజర్ పై మాత్రం శంకర్ వైఫల్యాల ఇంపాక్ట్ కొంత వరకూ పడుతున్నట్లు వార్తలొస్తున్నాయి. %–%ఆర్ ఆర్ ఆర్%–% తర్వాత చరణ్ నుంచి రాబోతున్న చిత్రమిదే. ఆ సినిమా సెట్స్ లో ఉండగానే శంకర్ ని చరణ్ లాక్ చేసాడు. అయితే శంకర్ గత సినిమాలు సహా తాజాగా రిలీజ్ అయిన ఇండియన్ –2 కూడా అంచనాలు అందుకోవడంలో విఫలమైంది. రొటీన్ సినిమా తీసారనే విమర్శలున్నాయి.

ఈ నేపథ్యంలో గేమ్ ఛేంజర్ ఎలా ఉంటుందనే డిస్కషన్ ఫిలిం సర్కిల్స్ లో చర్చకొస్తుంది. శంకర్ ని ఈ కథని ఎంత కొత్తగా చూపిస్తాడు? చరణ్ ని తెరపై ఎలా చూపిస్తాడు? ఈసినిమా తొలి రోజు ఎలాంటి ఓపెనింగ్ లు సాధిస్తుంది? అనే చర్చ మొదలైంది. వీటన్నిం టిని శంకర్ అధిగమించాల్సి ఉంది. ఆయన సక్సెస్ లు కొడితే ఎలా ఉంటాయి? అన్నది చెప్పాల్సిన పనిలేదు. బాక్సాఫీస్ రికార్డులే తునా తునకలైపోతాయి.

అలాంటి సక్సెస్ గేమ్ ఛేంజర్ నుంచి ఉంటుందనే శంకర్ అభిమానులు ఆశిస్తున్నారు.

# గ్రీన్ బ్యూటీలో సన్ ప్లవర్ లా బుట్టబొమ్మ!


ఫ్యాషన్ వరల్డ్ లో ముంబై బ్యూటీ పూజాహెగ్డే ఓ స్పెషలిస్ట్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. అమ్మడి ఎంపికలు అమెలో బ్యూటీని అంతకంతకు హైలైట్ చేస్తుంటాయి. కటౌట్ కి తగ్గట్టు సొగసరి ఎంపిక చేసుకునే దుస్తులే అందాన్ని రెట్టింపు చేస్తుంటాయి. హైట్..వెయిట్ కి తగ్గట్టు అలంకరణ విషయంలో ఎంతో శ్రద్ధ తీసుకుంటుంది. డిజైనర్ దుస్తులైనా...సంప్రదాయ వస్త్రాలైనా బుట్ట బొమ్మ ధరించిందంటే ఆ దుస్తులకే వన్నె వచ్చేస్తుంది. తాజాగా అమ్మడు గ్రీన్ బ్యాక్ గ్రౌండ్ లో సన్ ప్లవర్ పువ్వులతో ఇలా మురిపిస్తోంది. ఇదిగో ఇక్కడిలా అమ్మడు బ్యాక్ గ్రౌండ్ ని మ్యాచ్ చేస్తూ డిజైనర్ పచ్చందం దుస్తుల్లో ఒదిగిపోయింది. గ్రీన్ కలర్ కోట్ పై మ్యాచింగ్ గా డిఫరెంట్ లెగ్ ఇన్ ఎంపిక చేసుకుంది. పువ్వుల డిజైన్ లెగ్ ఇన్



పై చేతులకు..కాళ్లకు ధరించిన సాక్సులు సైతం అదే డిజైన్ తో కూడినవి. వీటిలో మ్యాడం ఎంతో అందంగా హైలైట్ అవుతుంది. చేతిలో సన్ ప్లవర్ పువ్వులు పట్టుకుంది. రెండు కళ్లు మూసుకుంది. కాళ్లకు హైహీల్స్ ధరించింది. ఈ మొత్తం సన్నివేశాన్నిహైలైట్ చేస్తూ కెమారాకి వివిధ భంగిమల్లో ఫోజులిచ్చింది. ప్రస్తుతం ఆ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. దీపికలో మెరుపు ఏమాత్రం తగ్గలేదు. ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో ఎలా ఉందో? ఇప్పటికీ అదే బ్యూటీని మెయింటెన్ చేస్తోంది. ఇక పూజా కెరీర సంగతి చూస్తే..టాలీవుడ్ నుంచి ఎంత సాలిడ్ గా వెళ్లిందో? అంతే సాలిడ్ గా అమ్మడు సౌత్ లో కంబ్యాక్ అవుతోన్న విషయం తెలిసిందే. యువ సామ్రాట్ నాగచైతన్య సరసన ఓ కొత్త సినిమాకి ఇటీవలే సంతకం చేసింది. అతి త్వరలోనే ఆ ప్రాజెక్ట్ పట్టాలెక్కనుంది. అలాగే కోలీవుడ్ లో సూర్య 44వ చిత్రంలోనూ పూజ అవకాశం అందుకుంది.

# టాప్ యాంగిల్ లో 'చిరుత' పిల్ల చిచ్చర పిడుగు!

హాట్ బ్యూటీ నేహా శర్మ టెంప్టింగ్ ఎలివేషన్ల గురించి చెప్పాల్సిన పనిలేదు. అమ్మడు ఇన్ స్టాకి ఎక్కిం దంటే? అక్కడ మంటలు తథ్యం. సామాజిక మాధ్యమాల వెల్లువలో అమ్మడి విలాపం యువతలో చర్చ కొస్తుంది. నిరంతర ఫోటోషూట్లతో సెల్ఫీ షూట్లతో యువతలో మంటలు పుట్టిస్తుంది. రేర్ గా సోదరి ఐశా శర్మని సైతం సీన్ లోకి తెచ్చి డబుల్..ట్రిపుల్ కిక్కేస్తుంది. ఇది నేహా కి మాత్రమే తెలిసిన టెక్నిక్. చేతిలో సినిమాలు లేకపోయినా జనాల్లో ఎలా హైలైట్ అవ్వాలో అవుతూ..తనదైన మార్క్ వేస్తుంది. తాజాగా అమ్మడు సెగలు పుట్టించే మరో సెల్ఫీతో ఇన్ స్టాలోకి వచ్చే సింది. ఇదిగో ఇక్కడిలా టాప్



యాంగిల్ లో చెలరేగింది. బ్లాక్ కలర్ బ్లౌజ్ లో అందాల దాడి చేసింది. బాటమ్లో కాంబినేషన్ వైట్ కలర్ ప్యాంట్ లో మురపించింది. అమ్మడు టాప్ టూ బాటమ్ ఇచ్చిన ఎలివేషన్ మామూలుగా లేదు. క్లోజప్ షాట్ లో అదరగొట్టింది. మరో పిక్ లో కాఫీ కప్ తో అలరించింది. ప్రస్తుతం ఈ ఫోటోలు అంతర్జాలంలో వైరల్ గా మారాయి. కుర్రకారు హాట్ కామెంట్లతో విరుచుకు పడతున్నారు. ఇంత వరకూ బాగానే ఉంది నేహా! మరి కెరీర్ సంగతేంటి అంటే? అమ్మడు ఇంకా ఆ హైట్స్ ని అందుకోలేదనే చెప్పాలి. టాలీవుడ్ లో చిరుతతో లాంచ్ అయినా అమ్మడు ఆ తర్వాత అదే వేగాన్ని కొనసాగించలేకపోయింది. కొన్ని సినిమాల్లో నటించి నిష్క్రమించాల్సి వచ్చింది. అటుపై బాలీవుడ్ లో స్థిరపడింది. అక్కడ సినిమాలు చేస్తూ కొన్నాళ్ల పాటు బిజీ నటిగా మారింది. కానీ వైఫల్యాలు స్టార్ హీరోయిన్ల జాబితాలో చేర్చలేకపోయాయి.




## శని, ఆదివారాల్లో ఎందుకు కూల్చేస్తున్నారు?: హైడ్రాను ప్రశ్నించిన హైకోర్టు

హైదరాబాద్: హైడ్రా తీరుపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో కూల్చివేతలపై పలువురు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై సోమవారం విచారణ జరిగింది. విచారణకు హైడ్రా కమిషనర్ రంగానథ్ వర్చువల్‌గా, అమీన్‌పూర్ తహసీల్దార్ కోర్టులో హాజరై వివరణ ఇచ్చారు. శని, ఆదివారాలు, సూర్యాస్తమయం తర్వాత ఎందుకు కూల్చివేతలు చేపడుతున్నారని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆదివారం మీరు ఎందుకు పని చేయాలని ప్రశ్నించింది. సెలవుల్లో ఎందుకు నోటీసులు ఇచ్చి, అత్యవసరంగా కూల్చివేస్తున్నారని అడిగింది. శని, ఆదివారాల్లో కూల్చివేయొద్దని గతంలో కోర్టు తీర్పులున్నాయని గుర్తు చేసింది. కోర్టు తీర్పుల విషయం కూడా తెలియదా అని తహసీల్దార్‌ను ప్రశ్నించింది. గతంలో మీరు కూల్చివేసిన కేసుపై స్టే విధించిన విషయం తెలియదా? అని అడిగింది. చట్టప్రకారం నడుచుకోకపోతే ఇబ్బందులు పడాల్సి వస్తుందని తహసీల్దార్‌ను హెచ్చరించింది. “రాజకీయ నేతలు, ఉన్నతాధికారులు చెప్పినంత మాత్రాన అక్రమంగా ముందుకు వెళ్లొద్దు. ఇల్లు కూల్చే ముందు యజమానికి చివరి అవకాశం ఏమైనా ఇచ్చారా? ప్రభుత్వ ఆస్తుల రక్షణ పేరుతో అమాయకులను ఇబ్బందులకు గురి చేస్తారా?” అని ఉన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. కోర్టు అడిగిన ప్రశ్నలకే సమాధానం ఇవ్వాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సూచించింది. కూల్చివేతకు యంత్రాలు, సిబ్బందిని కోరడంతో సమకూర్చామని బదులివ్వగా.. చార్మినార్ కూల్చివేతకు తహసీల్దార్ యంత్రాలు, సిబ్బంది అడిగితే ఇస్తారా? అని హైకోర్టు ప్రశ్నించింది. హైడ్రా ఇదే విధంగా ముందుకు వెళ్తే స్టే ఇవ్వాల్సి వస్తుందని హెచ్చరించింది. “ఖాళీ చేయనంత మాత్రాన అత్యవసరంగా కూల్చాల్సిన అవసరం ఏముంది? పొలిటికల్ బాస్‌లను సంతృప్తిపరిచేందుకు, పై అధికారులను మెప్పించేందుకు చట్టవిరుద్ధంగా పని చేయొద్దు. చనిపోయే వ్యక్తిని కూడా చివరి కోరిక అడుగుతారు కదా? ఆదివారం కూల్చివేతలు హైకోర్టు తీర్పునకు వ్యతిరేకమని తెలియదా? అధికారులు చట్టవ్యతిరేకంగా పనిచేస్తే ఇంటికెళ్తారు.. జాగ్రత్త.

**ఒక్కరోజులో హైదరాబాద్‌ను మార్చాలనుకోవడం సరికాదు :** మూసీపై కూడా 20 లంచ్ మోషన్ పిటిషన్లు దాఖలయ్యాయి. ఇది అరుదైన కేసుగా భావించే అధికారులను విచారణకు పిలిచాం. జీవో ప్రకారం హైడ్రాకు ఎన్నో విధులు ఉన్నాయి. మిగతావి పట్టించుకోకుండా కూల్చివేతలపైనే దృష్టి పెట్టారు. ట్రాఫిక్ సమస్యపైనా హైడ్రాకు బాధ్యత ఉంది. కానీ దాని గురించి ఏమాత్రం పట్టించుకోవట్లేదు. మాదాపూర్‌లో ప్రయాణం ఎంత సమయం పడుతుందో తెలుసు కదా? నిబంధనలు పాటించకుంటే హైడ్రా ఏర్పాటు జీవోపై స్టే ఇవ్వాల్సి వస్తుంది. సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేస్తేనే సామాన్యులు ఇళ్లు నిర్మిస్తున్నారు. స్థానిక సంస్థ అనుమతి ఇస్తేనే ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపంతో సామాన్యులు నష్టపోవాల్సి వస్తోంది. ఆదివారం కూల్చివేతలు వద్దని త్రిసభ్య ధర్మాసనం తీర్పు ఉంది.

అక్రమ నిర్మాణాలు అనిపిస్తే సీజ్ చేయవచ్చు కదా? హైడ్రా ఏర్పాటు అభినందనీయం.. పనితీరే అభ్యంతరకరం. అమీన్‌పూర్ తహసీల్దార్, హైడ్రా కమిషనర్ తీరు అసంతృప్తికరం. ఒక్కరోజులో హైదరాబాద్‌ను మార్చాలనుకోవడం సరికాదు. ఎఫ్టీఎల్ నిర్ధరించకుండా అక్రమాలు అని ఎలా తేలుస్తారు?” అని హైకోర్టు ప్రశ్నించింది. విచారణను అక్టోబర్ 15కు వాయిదా వేసింది. అప్పటివరకు యథాతథ స్థితి కొనసాగించాలని హైడ్రా, అమీన్‌పూర్ తహసీల్దార్‌ను ఆదేశించింది. కౌంటర్లు దాఖలు చేయాలని చెప్పింది.




## ఘోరం.. వెయ్యి మంది స్పాట్ డెడ్

ఇజ్రాయెల్: లెబనాన్‌లోని హిజ్బుల్లా లక్ష్యాలపై ఇజ్రాయెల్ భీకర వైమానిక దాడులు జరిపింది. తాజా దాడిలో 100 మందికి పైగా మరణించారు. 350 మందికి పైగా గాయపడినట్లు లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదివారం తెలిపింది. శనివారం జరిగిన వైమానిక దాడుల్లో 33 మంది మృతి చెందగా, 195 మంది గాయపడ్డారు. గత రెండు వారాలుగా లెబనాన్‌లో ఐడీఎఫ్ జరుపుతున్న దాడుల్లో మృతుల సంఖ్య మొత్తంగా వెయ్యి దాటినట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్ హిజ్బుల్లా అగ్రనాయకత్వాన్ని అంతమొందిస్తూ వస్తోంది. సెప్టెంబర్ 27న హిజ్బుల్లా గ్రూప్ చీఫ్ హసన్ నస్రల్లాను చంపేసింది.

గత వారంలో వైమానిక దాడుల్లో 7 మంది కీలక కమాండర్లను హతమార్చింది. టెర్రర్ గ్రూప్ సెంట్రల్ కౌన్సిల్‌లోని సీనియర్ సభ్యుడు నబిల్ కౌక్‌ను కూడా చంపేశారు. భీకర దాడులు కొనసాగుతున్నప్పటికీ హిజ్బుల్లా దళాలు ప్రతిఘటిస్తూనే ఉన్నాయి.

**80 టన్నుల బాంబు దాడి..** శుక్రవారం రాత్రి 9:30కు ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో నస్రల్లా మరణించినట్లు హిజ్బుల్లా శనివారం ప్రకటించింది. బీరుట్‌లోని హిజ్బుల్లా ప్రధాన కార్యాలయంపై ఇజ్రాయెల్ సైన్యం 80 టన్నుల బాంబులతో దాడి చేసింది. నస్రల్లా తన కుమార్తెతో అక్కడ ఉన్నాడని తెలిసింది. బాంబు దాడి అనంతరం.. ఇజ్రాయెల్ సైన్యం తన సోషల్ మీడియా ఖాతాలలో "హసన్ నస్రల్లా ఇకపై ప్రపంచాన్ని భయపెట్టలేడు" అని పోస్ట్ చేసింది. నస్రల్లా మరణం తరువాత మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరిగాయి.

**అత్యవసర సమావేశానికి పిలుపు..** నస్రల్లా మృతితో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అత్యవసర సమావేశానికి పిలుపునిచ్చారు. దక్షిణ బీరుట్‌లోని హిజ్బుల్లా ప్రధాన కార్యాలయంపై ఇజ్రాయెల్ దాడులు చేసిన తర్వాత ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఇరాన్ అధికారులు తెలిపారు. నస్రల్లాను అంతమొందించడంతో ఖమేనీని సురక్షిత ప్రదేశానికి తరలించారు.





హైదరాబాద్: లక్షలాదిమంది అభ్యర్థులు ఉత్కంఠతో ఎదురుచూస్తోన్న తెలంగాణ డీఎస్సీ ఫలితాలు వచ్చేశాయ్.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించిన డీఎస్సీ పరీక్షల ఫలితాల ను సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేశారు. జులై 18 నుంచి ఆగస్టు 5వరకు ఈ పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 11,062 టీచర్ పోస్టుల భర్తీకి పరీక్షలు నిర్వహించగా.. 2.45 లక్షల మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యారు.

**డీఎస్సీ.. 1:3 నిష్పత్తిలో వెరిఫికేషన్.. 9న నియామక పత్రాలు: సీఎం రేవంత్‌రెడ్డి :** కేవలం 55 రోజుల్లోనే డీఎస్సీ ఫలితాలు విడుదల చేశామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సచివాలయంలో ఫలితాలను విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. 1:3 నిష్పత్తిలో వెరిఫికేషన్ ఉంటుందని చెప్పారు. అక్టోబర్ 9న ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు అందజేస్తామన్నారు. గత పదేళ్లలో భారాస ప్రభుత్వం ఒకే ఒక్క డీఎస్సీ ఇచ్చిందని.. కేవలం 7వేల పోస్టులతో ఒకే నోటిఫికేషన్ విడుదల చేసిందని విమర్శించారు. టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశామని.. త్వరలోనే గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు. పాఠశాల ఫీజుల నియంత్రణపై త్వరలో కమిటీ వేస్తామని సీఎం తెలిపారు.

## కేసీఆర్‌కు పట్టిన గతే రేవంత్‌కు పడుతుంది.. ఎంపీ అరవింద్ ఫైర్



నిజామాబాద్: కాంగ్రెస్ రైతులను నమ్మించి మోసం చేసిందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ విమర్శించారు. మహేశ్వర్ రెడ్డి బీజేపీ నేత అయినప్పటి నుంచి కాంగ్రెస్ ప్రభుత్వానికి చెందిన ఎన్నో స్కాములు, అవినీతిని బట్టబయలు చేశారని అన్నారు. కాంగ్రెస్‌కు హైదరాబాద్‌లో సీట్లు రాలేదు.. ఆ పార్టీ ఎమ్మెల్యేలకు గ్రామీణ ప్రాంతాల్లో ఓట్లు వచ్చాయని చెప్పారు. ఇవాళ(సోమవారం) ఇందిరా పార్క్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో రైతు దీక్ష జరిగింది. ఈ దీక్షలో ఎంపీ ధర్మపురి అరవింద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. అందుకే ఇక్కడ పేదల ఇళ్లను కూలుస్తున్నారని విమర్శించారు. తొమ్మిదేళ్లు తెలంగాణలో ప్రజా కంటగింపు పాలనను చూశామన్నారు. కేసీఆర్ ఇక అధికారంలోకి రాడని.. నేరుగా సీఎం రేవంత్‌రెడ్డి పేదల ఇళ్లను కూలుస్తున్నారని మండిపడ్డారు. ముస్లింలను ఒకలా.. హిందువులను మరోలా చూస్తున్నారని ధ్వజమెత్తారు. హిందువుల ఇళ్లను మాత్రమే హైడ్రా కూలుస్తుందని ఆరోపించారు. రేవంత్ ప్రభుత్వంలో రైతు రుణమాఫీలేదు.. రైతు భరోసా లేదు.. బోనస్ ముచ్చటే లేదని మండిపడ్డారు. ప్రమాదవశాత్తు పంట నష్టం జరిగితే ఆదుకునే నాథుడే లేరని ఎంపీ అరవింద్ అన్నారు. కేసీఆర్.. ఒక ఎకరాకు కోటి సంపాదిస్తున్నాడట.. కోటి సంపాదన ఎలా సాధ్యమో తెలుసుకునేందుకు ప్రభుత్వం నుంచి ఒక టీమ్‌ను ఆయన ఫాంహౌస్‌కు కూడా పంపాలని కోరారు. పరిశీలించడానికి రేవంత్ టీంను ఏర్పాటు చేయాలని కోరారు. రైతులకు గైడ్ చేయాలని సూచించారు. కేసీఆర్ దిగిపోయాక ఆయన మాటలను చాలా మిస్ అవుతున్నానని అన్నారు. ఉద్యమ సమయంలో ఆయన పులిలా ఉన్నారు.. ఇప్పుడు పిల్లి లాగా అయ్యారని ఎంపీ అరవింద్ విమర్శలు చేశారు. కేసీఆర్.. తెలంగాణను నట్టేటా ముంచారని ఎంపీ అరవింద్ ఫైర్ అయ్యారు. ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే దారిలో పోతోందని విమర్శించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు అగ్రికల్చర్ పాలసీ ఎందుకు తీసుకురాలేదని ఎంపీ అరవింద్ ప్రశ్నించారు. మాజీ మంత్రి కేటీఆర్‌కు అల్లం, పసుపుకు తేడా తెలియదని.. ఆయన కూడా ఈరోజు మాట్లాడుతున్నారని ఎంపీ అరవింద్ ఎద్దేవా చేశారు. కేసీఆర్‌లాగే వరి మాత్రమే వేసుకునే పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిందని అన్నారు. రేవంత్ ప్రభుత్వంలో రైతు భరోసా కాదు.. బీమా కూడా అందట్లేదని ఎంపీ అరవింద్ ఆరోపించారు. మాజీ ప్రధాని ఇందిరమ్మను కూడా ప్రశాంతంగా ఉండనివ్వకుండా ఇంకా బదనాం చేస్తున్నారని అన్నారు. ప్రతి మండలానికి ఇంటర్నేషనల్ స్కూళ్లను ప్రారంభిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఇదే పరిస్థితి ఉంటే.. కేసీఆర్‌కు పట్టిన గతే రేవంత్‌కు పడుతుందని చెప్పారు. ఇప్పటికైనా రైతులను ఆదుకోవాలని కోరారు. కేసీఆర్‌ను ఆయన ఫ్యామిలీని చూసి ఇప్పటి పరిస్థితుల్లో ఎవరూ ఓటు వేయరని అన్నారు. బీజేపీ నేతలు అంతా ఇలాగే కలిసి కట్టుగా బలమైన అపొజిషన్‌గా వెళ్తే వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో అధికారం మనదేనని ఎంపీ అరవింద్ స్పష్టం చేశారు.

## బహిరంగ క్షమాపణ చెప్పాలి.. లేదంటే పరువు నష్టం దావా వేస్తా: హరీశ్‌రావు



హైదరాబాద్ : ప్రజా సమస్యలపై పోరాడుతున్న తనపై బురదజల్లే వికృత రాజకీయాలకు కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపుతోందని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను పక్కకు మళ్లించటానికి గోబెల్స్ ప్రచారాలను ఆశ్రయిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు ఎలా ఉందంటే.. ‘గోల్కొండ కోట, చార్మినార్‌లలో కూడా హరీశ్‌రావుకు వాటాలు ఉన్నాయి’ అనేటట్లుగా ఉందని ఎద్దేవా చేశారు.

తప్పుడు ప్రచారాలు చేస్తున్నందుకుగాను లీగల్ నోటీస్ పంపుతున్నాను. బహిరంగ క్షమాపణ చెప్పకుంటే పరువు నష్టం దావా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ ను ట్విట్టర్ వేదికగా హెచ్చరించారు.

## రైతు సమస్యలను పరిష్కరించడంలో రేవంత్ ప్రభుత్వం విఫలం



హైదరాబాద్: కేసీఆర్ పదేళ్ల పాటు చాలా హామిలు ఇచ్చి రైతులను మోసం చేశారని.. దీంతో ఎందరో అన్నదాతలు ఆత్మహత్య చేసుకున్నారని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. చనిపోయిన రైతు కుటుంబాలను కనీసం పరామర్శించని బీఆర్ఎస్ నేతలు ఇవ్వాళ స న్నాయి నొక్కులు నొక్కుతున్నారని మండిపడ్డారు. పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం ఏనాడు భూసార పరీక్షలు చేయలేదని చెప్పారు. నాడు బీఆర్ఎస్ నేడు కాంగ్రెస్ అదే విధానాన్ని అవలంభిస్తున్నాయని ధ్వజమెత్తారు. ఇవాళ(సోమవారం) ఇందిరా పార్క్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో రైతు దీక్ష జరిగింది. ఈ దీక్షలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘునందన్ రావు మాట్లాడుతూ... రైతు సమస్యలను పరిష్కరించడంలో రేవంత్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ధ్వజమెత్తారు. పంట నష్టపోతే ఆదుకునేందుకు ఫసల్ బీమాను కేంద్రం తీసుకువస్తే.. కేసీఆర్ ఎందుకు తెలంగాణలో అమలు చేయనివ్వలేదని ప్రశ్నించారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఎంత అపఖ్యాతి మూటగట్టుకుందో.. 10 నెలల్లో కాంగ్రెస్ అంత మూట గట్టుకుందని విమర్శించారు. కేసీఆర్.. ఫామ్ హౌస్‌ను జాతికి అంకితం చేస్తావా? ఏం చేస్తావో తెలియదని అన్నారు. రైతులకు న్యాయం చేయాలని అన్నారు. కేసీఆర్ అవినీతి లక్ష కోట్లను సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి కక్కిస్తామని హెచ్చరించారు. నాడు పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్.. సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారని.. కానీ ఇప్పుడు సిట్టింగ్ జడ్జి దొరకలేదా? రిటైర్ అయిన జడ్జితో సిట్ వేశారని ఎద్దేవా చేశారు. రేవంత్ మూసీ సుందరీకరణ పేరిట కొత్త డ్రామా మొదలు పెట్టారని విమర్శించారు. తెలంగాణలో రైతుల సమస్యలు తీర్చడం బీజేపీకే సాధ్యమని అన్నారు. కాంగ్రెస్ ఒక 420 అనే విషయం అందరికీ తెలుసునని మెదక్ ఎంపీ రఘునందన్ రావు విమర్శలు చేశారు.

## వన్ నేషన్ పేరిట హక్కులను కాలరాస్తున్న కేంద్రం



హైదరాబాద్: వన్ నేషన్ పేరిట హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ విమర్శలు చేశారు. వన్‌నేషన్ పేరుతో హక్కులను కాలరాస్తు ఆర్డినెన్సు లు తీసుకొచ్చే ఆలోచనలను కేంద్రం చేస్తోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.. అదే జరిగితే ప్రజాస్వామ్యం ఉండదని హెచ్చరించారు. రాజ్యాంగాన్ని పూర్తిగా నాశనం చేసేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నాలు తీవ్రంగా చేస్తోందని ఆరోపించారు. ఈ విషయంపై దేశవ్యాప్తంగా పోరాటానికి సిద్ధమవుతామని వార్నింగ్ ఇచ్చారు. నేపాల్‌లో అధిక వర్షాల ప్రభావం బీహార్ మీద పడిందని చెప్పారు. దాన్ని పరిశీలించడానికి కేంద్ర పార్టీ బృందం వెళ్తోందని తెలిపారు. అక్కడ ఎలాంటి సహాయచర్యలు చేపట్టాలనే దానిపై సమావేశంలో చర్చించిన తర్వాత ప్రకటిస్తామని అన్నారు.. హైడ్రాపై నారాయణ షాకింగ్ కామెంట్స్ చేశారు. హైడ్రా చాలా హడావుడి చేస్తోందన్నారు. వికారాబాద్‌లో ఫిరంగి నాలానీ ప్రక్షాళన చేయాలని గతంలో వికారాబాద్ నుంచి ఇబ్రహీంపట్నం వరకు ర్యాలీ చేపట్టామని గుర్తుచేశారు. చెరువులు, కుంటలు ఉంటే భూ గర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. కమర్షియల్ కాంప్లెక్స్‌లు, అక్రమ నిర్మాణాలు కూల్చితే పెద్దగా సమస్యే లేదని అన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలోని నిర్వాసితులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపించి మూసీ ప్రక్షాళన చేయాల్సిందేనని స్పష్టం చేశారు.. కొంతమంది అడ్డు పడుతారు.. సమస్య ఉంది కాబట్టి వ్యతిరేకిస్తారని అన్నారు. నిర్వాసితులను కొత్త ఇళ్లలోకి తరలించిన తర్వాత కూల్చాలని సూచించారు. పేదలకు ప్రత్యామ్నాయాలు చూపకుండా కూల్చోద్దని కోరారు. ఫిరంగి నాలాను ప్రక్షాళన చేయాలని అన్నారు. కమర్షియల్ కాంప్లెక్స్‌లు అక్రమంగా ఉంటే కూల్చాల్సిందేనని అన్నారు. పేదలకు అన్యాయం చేయొద్దని తెలిపారు. భారత దేశంలో మౌలిక సదుపాయాల కోసం విపరీతంగా ఖర్చు చేస్తున్నారని చెప్పారు. హైవేలకు , ఎక్స్‌ప్రెస్ హైవే లు నిర్మాణం చేస్తున్నారని తెలిపారు. అయితే... ఎక్స్‌ప్రెస్ హైవేలో సైడ్స్‌లో చాలా హైట్‌లో గోడలు కడుతున్నారని వివరించారు. రైతుల భూములు చుట్టూ ఉంటాయని... వారు ఎక్కడ నుంచి నడవాలని ప్రశ్నించారు. తాత్కాలిక ఉపశమనం కోసం అక్కడక్కడ గ్యాప్ ఇస్తున్నారని చెప్పారు. కానీ తమ డిమాండ్ మొత్తం దేశవ్యాప్తంగా ఎక్స్ ప్రెస్ వేలలో రైతులకు ఇబ్బందులు లేకుండా చేయాలనేదే ప్రధాన డిమాండ్ అని తెలిపారు. సర్వీస్ రోడ్‌లో ఉండాల్సిందేనని చెప్పారు. అభివృద్ధి జరగాలి.. అంటే... అదాని అభివృద్ధి కాదని.. అందుకే కేంద్ర మంత్రి నితిన్ గడ్కారీకి లేఖ రాశామని తెలిపారు. రైతులకు అన్యాయం చేస్తే... తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగుతామని సీపీఐ నారాయణ హెచ్చరించారు.

## పంచాయతీల్లో పాలన గాడి తప్పింది.. సీఎం రేవంత్‌పై కేటీఆర్ విసుర్లు

హైదరాబాద్‌బీ ఢిల్లీ విమానం ఎక్కడం..దిగడమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సరిపోతుంది.. కానీ ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. పల్లెలేమో నిధుల్లేక నీరసంతో తల్లడిల్లిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు సోషల్ మాధ్యమం ట్విట్టర్(ఎక్స్)లో కేటీఆర్ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ఆసరా పథకం పైసలు కూడా కాంగ్రెస్ ప్రభుత్వ విడుదల చేయడం లేదని ధ్వజమెత్తారు. రోడ్లు వేయడానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం దగ్గర నిధులు లేవా? అని కేటీఆర్ ప్రశ్నించారు.

**అప్పులపాలు కావల్సిందేనా..** “మాజీ సర్పంచుల సంగతి సరే చివరకు పంచాయతీ కార్యదర్శులు కూడా అప్పులపాలు కావల్సిందేనా రేవంత్. దేశానికి పట్టుగొమ్మలు గ్రామాలు. అలాంటి గ్రామాలను అభివృద్ధి చేయాలని “పల్లెప్రగతి” కార్యక్రమం చేపట్టింది కేసీఆర్ ప్రభుత్వం. అలాంటి గొప్ప కార్యక్రమం పల్లె ప్రగతిని అటకెక్కించారు వృద్ధులకు సరైన సమయానికి ఆసరా పెన్షన్లు అందక అల్లాడుతుంటే దాచుకున్న డబ్బులతో తప్పని పరిస్థితుల్లో రోడ్లు వేస్తున్నారు. ఆసరా పెన్షన్‌తో దాతలుగా సహాయం చేస్తే తప్ప రోడ్లు వేయలేని పరిస్థితి గ్రామాల్లో ఉంది” అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

**ఆలోచించుకో రేవంత్..** “అవ్వాతాతలకే కాదు చివరకు గ్రామ పనులకు కూడా కేసీఆర్ ఆసరా పథకం ఆసరా అవుతోంది. ఎందుకు మీ పాలన– కొంచెం కూడా సిగ్గు అనిపిస్త లేదా. ప్రజల బాధలు చూసి తలకాయ ఎక్కడ పెట్టుకుంటావో ఆలోచించుకో రేవంత్. ఫైనాన్స్ కమిషన్ నిధులు కూడా విడుదల చేయకపోవడంతో గ్రామాలు కునారిల్లుతున్నాయి. పంచాయతీల్లో పాలన గాడితప్పింది..పారిశుద్ధ్యం పడకేసింది....ప్రజలు రోగాల పాలవుతున్నారు.. ఎన్నికల సమయంలోనేమో 100 రోజుల్లో నెరవేరుతుంది ప్రతి గ్యారంటీ అని ఫుల్ పేజీ ప్రకటనలు, స్టాంపు పేపర్ల మీద అఫిడవిట్లు ఇప్పుడేమో, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 300 రోజుల తర్వాత, మీ నాయకులు, కార్యకర్తలు కాని ప్రజలకు సమాధానం చెబుతారా..? ఢిల్లీ నుంచి రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ వచ్చి ప్రజలకు క్షమాపణ చెబుతారా” అని కేటీఆర్ ప్రశ్నించారు.

## ఆరు గ్యారంటీలను పూర్తిచేసే సత్తా ప్రభుత్వానికి లేదు: ఈటల

ఇందిరాపార్క్: రుణమాఫీ పూర్తిగా సాధ్యం కాదని తెలిసి కూడా కాంగ్రెస్ నేతలు హామీలు ఇచ్చారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. ఆరు గ్యారంటీల్లో ఒక్కటి కూడా పూర్తి చేసే సత్తా కాంగ్రెస్‌కు లేదని గతంలోనే చెప్పానని అన్నారు. ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన భాజపా ప్రజాప్రతినిధుల 24 గంటల రైతు హామీల సాధన దీక్షలో ఈటల మాట్లాడారు.

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం మాత్రమే పూర్తిగా అమలు చేశారన్నారు. “ రూ.లక్ష రుణమాఫీ చేస్తామని చెప్పి అప్పట్లో కేసీఆర్ కూడా పూర్తి చేయలేదు. నిరుద్యోగులకు నిరుద్యోగభృతి హామీని కూడా ఆయన నెరవేర్చలేదు. రూ.లక్ష రుణమాఫీకి రూ.24 వేల కోట్లు అవసరమైతే.. కేవలం రూ.14 వేల కోట్లు ఇచ్చారు.” అని ఈటల అన్నారు. ఈ దీక్షలో ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, రామారావు, సూర్యనారాయణ, హరీశ్‌బాబు పాల్గొన్నారు.



Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com